విశాఖ డెయిరీపై సభాసంఘం

- అక్రమాలు చోటు చేసుకుంటున్నాయని అసెంబ్లీలో ఎమ్మెల్యేల ఆరోపణ
- డెయిరీని రైతులకు కాకుండా చేసి ఓ కుటుంబం సొంత ఆస్తిలా ఉపయోగించుకుంటున్నదని విమర్శ

- 8లో

నక్కపల్లిలో బల్క్ డ్రగ్ పార్క్!

- రెండు వేల ఎకరాలు కేటాయింపు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా నిర్వహణ
- రూ.14 వేల కోట్ల పెట్టుబడులు
- 70 వేల మందికి ఉపాధి

కేంద్ర ప్రభుత్వం ఆమోదం

వీసీఐసీకి సేకరించిన భూముల్లో ఏర్పాటు



బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటుకు కేటాయించిన ఏపీఐఐసీ భూములు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

జిల్లాకు మరో భారీ పరిశ్రమ రానున్నది. నక్కపల్లి కేంద్రంగా బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటుకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ (వీసీఐసీ) కోసం ఏపీఐఐసీ సేకరించి సుమారు రెండు వేల ఎకరాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి ఆధ్వర్యంలో బల్క్ డ్రగ్ పార్కును ఏర్పాటు చేయనున్నారు. దీంతో నక్కపల్లి, పరిసర ప్రాంతాలను ఫార్మా హబ్‌గా మార్చాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలిసింది.

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత సంక్షేమంతోపాటు అభివృద్ధిపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేక దృష్టి సారించారు. కేంద్రం నుంచి పూర్తిస్థాయిలో సహకారం అందుతుండడంతోపాటు, చంద్రబాబునాయుడు దక్షతను చూసి పెట్టుబడులు పెట్టేందుకు పలు ప్రముఖ సంస్థలు, కంపెనీలు ముందుకు వస్తున్నాయి. ఇప్పటికే నక్కపల్లి సెజ్‌లో రూ.70 వేల కోట్లతో 17.8 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యం వున్న ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు ఆర్సెలర్ మిట్టల్- నిప్పాన్ స్టీల్స్ ఇండియా ముందుకొచ్చిన విషయం తెలిసిందే. ఈ భారీ పరిశ్రమ ఏర్పాటుకు ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తుందని సీఎం చంద్రబాబునాయుడు గత నెలలో పరవాడ పర్యటన సందర్భంగా ప్రకటించారు. తాజాగా సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఈ నెల 19వ తేదీన సచివాలయంలో జరిగిన రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు(ఎస్ఐపీబీ) తొలి సమావేశంలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటుపై ఆర్సెలర్ మిట్టల్- నిప్పాన్ స్టీల్స్ ఇండియా ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. మరోవైపు ఇదే నక్కపల్లి మండలంలో ఐదేళ్ల నుంచి వైసీపీ ప్రభుత్వం ప్రతిపాదనలకే పరిమితం చేసి, అటెకెక్కించిన ప్రాజెక్టులను తిరిగి పట్టాలెక్కించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తున్నది విశాఖ- చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా నక్కపల్లి మండలం బుచ్చిరాజుపేట, చందనాడ, డీఎల్ పురం, రాజయ్యపేట, వేంపాడులో బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు ప్రతిపాదనకు కదలిక వచ్చింది.

నక్కపల్లిలో బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటుకు 2023 సెప్టెంబరు 20న వైసీపీ ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీని ఏర్పాటుకు భూసేకరణ చేపట్టలేదు. వాస్తవానికి బల్క్ డ్రగ్ పార్కును కాకినాడ జిల్లా తొండంగి మండలంలో ఏర్పాటు చేయాలని భావించారు. అయితే అక్కడ నుంచి అనకాపల్లి జిల్లాకు మార్పు చేసేందుకు గతంలో పెట్టిన ప్రతిపాదనకు కేంద్రం పచ్చజెండా ఊపేలా కూటమి ప్రభుత్వం ప్రయత్నాలు చేసింది. తాజాగా నక్కపల్లి మండలంలో బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీనిని పర్యావరణహితమైన అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటు చేయాలని ఎన్‌డీఏ ప్రభుత్వం భావిస్తోంది. గతంలో విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం ఏపీఐఐసీ సేకరించి సుమారు రెండు వేల ఎకరాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి ఆధ్వర్యంలో బల్క్ డ్రగ్ పార్కును ఏర్పాటు చేయనున్నారు. ఏపీఐఐసీ తుది న్యాయ పరిశీలన పూర్తి చేసిన అనంతరం బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటు పనులు వేగవంతం కానున్నాయి.

ఫార్మా హబ్‌గా నక్కపల్లి

బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటుతో నక్కపల్లి పరిసర ప్రాంతాలను ఫార్మా హబ్‌గా మార్చాలని ఎన్‌డీఏ ప్రభుత్వం భావిస్తున్నది. ఫార్మా రంగంలో సుమారు రూ.14 వేల కోట్ల పెట్టుబడులు వస్తాయని అంచనా వేస్తున్నారు. 30 వేల మందికి ప్రత్యక్షంగా, 40 వేల మందికి పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని భావిస్తున్నారు.

ఆధార్ దిద్దుబాటుకు నిరీక్షణ

చోడవరంలోని కేంద్రం వద్ద పెరిగిన రద్దీ

- రెండు నియోజకవర్గాలకు ఇదే పెద్ద దిక్కు
- గంటల తరబడి వేచి ఉండాల్సిన దుస్థితి



చోడవరంలోని ఆధార్ కేంద్రం వద్ద విద్యార్థులు, సామాన్య జనం

చోడవరం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):

విద్యార్థులకు 'అపార్' (ఆటోమేటెడ్ పర్మనెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) నంబర్ల కేటాయింపు, వివిధ ప్రభుత్వ పథకాలకు సంబంధించి ఆధార్ కార్డుల్లో తప్పులు సరిదిద్దేందుకు విద్యార్థులు, ఇతర వర్గాల ప్రజల రాకతో ఆధార్ కేంద్రం వద్ద విపరీతమైన రద్దీ నెలకొంది. దీంతో గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తున్నదని వాపోతున్నారు.

విద్యార్థులకు, వారి చదువుకు సంబంధించి సమస్త వివరాలను సమగ్రంగా నమోదు చేసేలా 'అపార్' నంబర్ కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. అపార్ నంబరు కేటాయింపు సందర్భంగా ఆధార్ కార్డులో చిన్నపాటి తప్పు ఉన్నా సాఫ్ట్‌వేర్ తిరస్కరిస్తుండడంతో విద్యార్థులు తమ ఆధార్ కార్డుల్లో తప్పులు సరిదిద్దుకునేందుకు ఆధార్ నమోదు కేంద్రానికి వస్తున్నారు. చోడవరం, మాడుగుల అసెంబ్లీ నియోజకవర్గాలకు ప్రస్తుతం చోడవరంలో మాత్రమే ఆధార్ నమోదు కేంద్రం వుండడంతో ఆయా మండలాల నుంచి విద్యార్థులు, ఇతరులు పెద్ద ఎత్తున ఇక్కడకు వస్తున్నారు. వాస్తవంగా ఆధార్ కార్డుల్లో తప్పులు సరిదిద్దుకునేందుకు మీసేవా కేంద్రాలతోపాటు, పోస్టాఫీసు, బ్యాంకులకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. అయితే గతంలో వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత మీసేవా కేంద్రాల సర్వీసులన్నింటినీ గ్రామ/ వార్డు సచివాలయాలకు బదలాయించడంతో చాలా వరకు మీ సేవాకేంద్రాలు మూతపడ్డాయి. ఒకటీ అరా కేంద్రాలు నడుస్తున్నప్పటికీ ఆధార్ కార్డుల్లో తప్పులు సరిదిద్దే అనుమతులు లేవు. మాడుగుల, బుచ్చెయ్యపేట మండలాల్లో ఉన్న ఆధార్ కేంద్రాలు ప్రస్తుతం పనిచేయడం లేదు. ఇక పోస్టాఫీసు, బ్యాంకుల్లో సిబ్బంది కొరత పేరుతో ఆధార్ కార్డుల్లో తప్పులను సవరించే పనులు తాము చేయడం లేదని చెబుతున్నారు. దీనితో మాడుగుల, చోడవరం నియోజకవర్గాల్లోని పలు మండలాలకు చెందిన విద్యార్థులు, సాధారణ ప్రజలు చోడవరం రావాల్సిన పరిస్థితి నెలకొంది. దీనితో స్థానిక పంచాయతీ కార్యాలయంలోని ఆధార్ కేంద్రం నిత్యం రద్దీగా వుంటున్నది. ఆధార్‌లో తప్పులను తప్పనిసరిగా సరిదిద్దుకోవాల్సి రావడంతో గంటల తరబడి నిరీక్షించి పనులు చేయించుకుంటున్నారు. ప్రభుత్వం స్పందించి ప్రతి మండలంలో ఆధార్ కేంద్రాలను అందుబాటులోకి తీసుకు రావాలని పలువురు కోరుతున్నారు.

ఎన్‌టీపీసీ హబ్ ప్రాంతాన్ని పరిశీలించిన ఎస్పీ



ఎన్‌టీపీసీ స్థలం వద్ద ఎస్పీ తుహిన్ సిన్హా

అచ్యుతాపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):
ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 29వ తేదీన శంకుస్థాపన చేయనున్న ఎన్‌టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ హబ్ ప్రాంతాన్ని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా బుధవారం సాయంత్రం పరిశీలించారు. అచ్యుతాపురం జంక్షన్ నుంచి పూడిమడక వద్ద గల హబ్ ప్రాంతానికి వెళ్లే మార్గంలో భద్రతా చర్యలు, హబ్ ప్రాంతంలో ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. ఆయన వెంట డీఎస్పీలు అప్పారావు, సత్యనారాయణ, అచ్యుతాపురం, రాంబిల్లి సీఐలు నమ్మి గణేశ్, సీహెచ్ నరసింగరావు ఉన్నారు.

ఇసుక డిపోల ఏర్పాటుకు టెండర్లు ఆహ్వానం

రేపటి నుంచి 29వ తేదీ వరకు గడువు

- 30వ తేదీన లాటరీ ద్వారా కేటాయింపు
- 4 ఎకరాల లీజు లేదా సొంతం భూమి ఉన్న వారు అర్హులు

అనకాపల్లి కలెక్టరేట్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):
జిల్లాలో ఇసుక స్టాక్ యార్డు(డిపో)ల ఏర్పాటు, నిర్వహణకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్టు కలెక్టర్ విజయకృష్ణన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనకాపల్లి, నర్సీపట్నం, చోడవరం, మాడుగుల, నక్కపల్లి, అచ్యుతాపురం మండలాల్లో ఒక్కొక్క డిపోను ఏర్పాటు చేస్తున్నట్టు ఆమె తెలిపారు. సుమారు నాలుగు ఎకరాల ప్రైవేటు స్థలం (లీజు లేదా సొంతం) కలిగిన వ్యక్తులు టెండర్ దాఖలు చేయడానికి అర్హులన్నారు. టెండర్లు వేయదలుచుకునే వారు ఒక్కొక్క కేంద్రానికి రూ.5 వేల చొప్పున 'జిల్లా స్థాయి శాండ్ కమిటీ, అనకాపల్లి' పేరిట డీడీ తీసి ఈ నెల 22వ తేదీ నుంచి 29వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంటలోపు జిల్లా గనులు, భూగర్భ శాఖ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు. 30వ తేదీన దరఖాస్తులు పరిశీలించి, లాటరీ విధానంలో ఇసుక స్టాక్ యార్డు(డిపో)లను కేటాయిస్తామని వెల్లడించారు. మరిన్ని వివరాలకు జిల్లా గనులు, భూగర్భ శాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

సన్విరా అడ్డదారి!

పంచాయతీ అనుమతులు లేకుండా రోడ్డు విస్తరణ

- పూడిమడక నుంచి ఫ్యాక్టరీ వరకు రెండు కి.మీ.ల మేర పనులు
- భారీ వృక్షాలు సైతం నరికివేత
- నిబంధనలకు విరుద్ధంగా సీఎస్ఆర్ నిధులు వినియోగం



రోడ్డు విస్తరణ పనుల కోసం ఉప్పు మడుల స్థలాన్ని చదును చేస్తున్న ఎక్స్‌కవేటర్

అచ్యుతాపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):

గ్రామ పంచాయతీ నుంచి గానీ, పంచాయతీరాజ్ శాఖ నుంచి గానీ ఎటువంటి అనుమతులు లేకుండా ఒక ప్రైవేటు కర్మాగారం యాజమాన్యం తన సొంత అవసరాల కోసం దర్జాగా రహదారిని వెడల్పు చేస్తున్నది. పైగా పనులకు అయ్యే వ్యయాన్ని కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధుల నుంచి ఖర్చు చేయడం విశేషం.

అచ్యుతాపురం- రాంబిల్లి మండలాల సరిహద్దులో పూడిమడక గ్రామానికి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో సన్విరా ఇండస్ట్రీస్ లిమిటెడ్ పేరుతో కర్మాగారం ఉంది. రాంబిల్లి మండలం చాటమెట్ట గ్రామ పరిధిలో సుమారు 150 ఎకరాల విస్తీర్ణంలో దీనిని ఏర్పాటు చేశారు. ఇక్కడ కాల్సైన్డ్ పెట్రోలియం కోక్ (సీపీసీ), ఇతర అనుబంధ ఉత్పత్తులను తయారు చేస్తారు ఇందుకోసం పలు రకాల ముడిపదార్థాలను దిగుమతి చేసుకుని, తయారైన పదార్థాలను ఎగుమతి చేస్తుంటారు. రోజూ 80 నుంచి 100 వరకు భారీ వాహనాలు ఎగుమతులు, దిగుమతులతో రాకపోకలు సాగిస్తుంటారు. కాగా అచ్యుతాపురం జంక్షన్ నుంచి పూడిమడక వరకు నాలుగు వరుసల రహదారి వుంది. పూడిమడక ఉన్నత పాఠశాల నుంచి సన్విరా కర్మాగారం వరకు రెండు కిలోమీటర్ల మేర సింగిల్ రోడ్డు మాత్రమే ఉంది. వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా వుందన్న ఉద్దేశంతో ఈ రోడ్డును వెడల్పు చేయాలని యాజమాన్యం భావించింది. అధికారులు పరోక్షంగా సహకరించడంతో రోడ్డు వెడల్పు పనులు చేపట్టారు. రోడ్డు నిర్మాణ పనులను రాజకీయ నేపథ్యం ఉన్న ఓ కాంట్రాక్టర్ చేపట్టడంతో అధికారులు ఎవరూ ఇటువైపు రావడంలేదు. వాస్తవంగా ఈ రెండు కిలోమీటర్ల రోడ్డు పూడిమడక పంచాయతీ పరిధిలో వుంది. పంచాయతీ నుంచి ఎటువంటి అనుమతులు తీసుకోకుండా రోడ్డు నిర్మిస్తున్నారని పూడిమడక సర్పంచ్ చేపల సుహాసిని, ఆమె భర్త చేపల వెంకట రమణ చెబుతున్నారు. అదే విధంగా పూడిమడక నుంచి సన్విరా కర్మాగారం వరకు రోడ్డు విస్తరణకు తాము ఎటువంటి అనుమతులు ... మిగతా 8వ పేజీలో

ఫార్మా పరిశ్రమలు మూత!

ఐదు రోజులుగా నిలిచిన నీటి సరఫరా

- పంప్‌హౌస్ వద్ద మోటార్ల మొరాయింపు
- నిర్వహణ గాలికి వదిలేయడంతోనే సమస్య
- మరమ్మతులు చేయించామన్న ఏపీఐఐసీ జోనల్ మేనేజర్



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

పరవాడ రాంకీ ఫార్మా సిటీకి నాలుగు రోజులుగా నీటి సరఫరా నిలిచిపోయింది. ఫార్మాసిటీలో వందకు పైగా మందుల తయారీ కంపెనీలు ఉన్నాయి. వాటి రోజువారీ కార్యకలాపాలకు నీరు చాలా ముఖ్యం. ఫార్మాసిటీని రాంకీ యాజమాన్యం అభివృద్ధి (డెవలపర్) చేయగా, రాష్ట్ర ప్రభుత్వం తరపున ఏపీఐఐసీ మౌలిక వసతులు సమకూర్చింది. ఏలేరు కాలువ నుంచి నీటిని తీసుకొని తాడి వద్ద గల పంప్ హౌస్ ద్వారా ఫార్మా సిటీకి పంపిస్తారు. అక్కడ వారు వాటిని శుద్ధి చేసి కంపెనీలకు సరఫరా చేస్తారు. ఇదే పంప్‌హౌస్ నుంచి అచ్యుతాపురం ఆర్థిక మండలిలోని ఫార్మా కంపెనీలకు కూడా పంపుతున్నారు. ఫార్మాసిటీకి, అచ్యుతాపురం ఆర్థికమండలికి కలిపి రోజుకు 15 మిలియన్ లీటర్ల నీటిని అందిస్తున్నారు. ఇందుకోసం అత్యధిక సామర్థ్యం కలిగిన 750 హార్స్‌పవర్ మోటార్లు నాలుగు ఉన్నాయి. అవి పాడైతే మరమ్మతులు చేయడానికి టెక్నీషియన్లు కూడా అందుబాటులో ఉండరు. అందుకని వాటిని జాగ్రత్తగా నిర్వహిస్తారు. అయితే ఈ ఏడాది జూన్‌లో ఒక మోటారు పాడైపోయింది. దానికి మరమ్మతులు చేయించడానికి ఎవరూ ముందుకురాలేదు. ఆ తరువాత ఒకదాని తరువాత మరొకటి అన్నీ మొరాయించాయి. దీంతో నెల 15వ తేదీ (శుక్రవారం) సాయంత్రానికి నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. విచిత్రం ఏమిటంటే...ఇక్కడ నీటిని ఏ రోజుకు ఆ రోజే సరఫరా చేస్తారు. ముందుచూపుతో కొంత నీటిని రిజర్వ్ చేసే సదుపాయం కూడా లేదు. దాంతో ఫార్మా కంపెనీలకు ఇబ్బందులు మొదలయ్యాయి. కొందరు అరకొరగా ఉన్న నీటితో రెండు రోజులు సర్దుబాటు చేసుకొని ఆ తరువాత యూనిట్లు షట్‌డౌన్ చేశారు. పెద్ద కంపెనీలు డబ్బులు పెట్టి ... మిగతా 8వ పేజీలో

పునరుద్ధరించాం

నీటి సమస్య తలెత్తిన మాట వాస్తవమే. ఆ మోటార్లకు మరమ్మతులు చేసేవారు అందుబాటులో లేరు. కాకినాడ నుంచి మనుషులను రప్పించి చేయించాల్సి వచ్చింది. సమస్య బుధవారం సాయంత్రానికి పరిష్కారమైంది. నీటి సరఫరా ప్రారంభించాం. రాత్రికి అచ్యుతాపురం యూనిట్లకు కూడా అందిస్తాం. కొత్త పంపుల నిర్మాణానికి రూ.70 లక్షలతో ప్రతిపాదనలు పెట్టాం.

హరిప్రసాద్, జోనల్ మేనేజర్ ఏపీఐఐసీ

రూ.కోట్ల ఆదాయం వస్తున్నా నిర్లక్ష్యం

పారిశ్రామిక పార్కులకు నీటిని సరఫరా చేస్తూ ఏపీఐఐసీ కోట్ల రూపాయల ఆదాయం ఆర్జిస్తోంది. పంపు హౌస్‌లు, మోటార్ల నిర్వహణ గాలికి వదిలేస్తోంది. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఈ దుస్థితి వచ్చింది. బ్యాకప్ మోటార్లు ఉంచుకోవలసిన అవసరం ఉంది. కానీ పట్టించుకోలేదు. ఇప్పటికైనా మేల్కొనాలి.

ఓ.నరేశ్‌కుమార్, వైజాగ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న వీఓఏలు

మూడేళ్ల సర్క్యులర్‌ను రద్దు చేయాలి

- వీఓఏలు డిమాండ్.. కలెక్టరేట్ వద్ద ధర్నా

అనకాపల్లి కలెక్టరేట్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):
జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) పరిధిలోని వెలుగులో పనిచేస్తున్న వీఓఏల మూడు సంవత్సరాల కాల పరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని, నాలుగు నెలల బకాయి వేతనాలు చెల్లించాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షురాలు రూపాదేవి డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వీఓఏలు బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గత వైసీపీ ప్రభుత్వం వీఓఏలకు ... మిగతా 8వ పేజీలో

సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలి

- పోలీసులు, బ్యాంకర్ల మధ్య సమన్వయంతో ముఖ్యం
- ఎస్పీ తుహిన్ సిన్హా



బ్యాంకుల ప్రతినిధులు, పోలీసు అధికారులతో సమావేశమైన ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి):
సైబర్ నేరాల గురించి ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని, దీని కోసం పోలీసులు, బ్యాంకర్లు సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా అన్నారు. బుధవారం తన కార్యాలయంలో పోలీసులు, బ్యాంకు ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సైబర్ నేరగాళ్లబారిన పడి నగదు పోగొట్టుకున్న బాధితులకు అండగా ఉండేందుకు పోలీసులు, బ్యాంకు ఉద్యోగులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఏ ఖాతాకు నగదు జమ అయ్యిందో ఆ ఖాతా వివరాలను పోలీసులకు అందించాలన్నారు. బ్యాంకుల్లో రూ.5 లక్షలు అంతకు మించి జరిగే లావాదేవీలపై నిఘా కొనసాగించాలని సూచించారు. బ్యాంకులు, ఏటీఎంల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. బ్యాంకుల్లో అత్యవసర అలారం పనిచేస్తున్నది లేనిది ఎప్పటికప్పుడు చూసుకోవాలన్నారు. అనుమానిత ఖాతాల ద్వారా జరిగే లావాదేవీలపై నిఘా పెంచితే సైబర్ నేరాల్లో బాధితులకు త్వరగా న్యాయం చేయగలమన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ ఎల్.మోహన్‌రావు, డీఎస్పీ అప్పారావు (ఎస్‌బీ), ఎం.శ్రావణి (అనకాపల్లి), సోషల్ మీడియా సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ కల్యాణి, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ సత్యనారాయణ, ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ జగదీశ్వరరావు, వివిధ బ్యాంకుల ప్రతినిధులు హాజరయ్యారు.

24న ఏటికొప్పాకలో బండిమాంబ జాతర

» 22న కబడ్డీ, 23న వాలీబాల్ టోర్నీ నిర్వహణకు ఏర్పాట్లు



ఎలమంచిలి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రసిద్ధిగాంచిన ఏటికొప్పాక బండిమాంబ జాతర ఈ నెల 24న జరగనుంది. ఇందుకు సంబంధించి ఉత్సవ కమిటీ ప్రతినిధులు భారీ ఏర్పాట్లు చేపడుతున్నారు. ఇప్పటికే ఆలయంతో పాటు పరిసరాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. విద్యుద్దీపాలంకరణ పనులు ప్రారంభమయ్యాయి. వేలాదిగా భక్తులు తరలి రానున్న నేపథ్యంలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా సన్నాహాలు చేపడుతున్నారు. ఇదిలావుంటే, వేడుకల్లో భాగంగా ఈనెల 22న కబడ్డీ, 23న వాలీబాల్ టోర్నీని ఎల్లమ్మ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్టు చెప్పారు. గ్రామ సర్పంచ్ భజంత్రీల లక్ష్మీరాము, మాజీ సర్పంచ్ కాండ్రకోట చిరంజీవి, గ్రామ పెద్దలు ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.

పట్టణ తూర్పు కాపు సంఘం అధ్యక్షుడిగా శ్రీను



సంఘ సభ్యుల అభినందన సభలో ఎంపీపీ తదితరులు

ఎలమంచిలి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఇక్కడికి సమీపంలోని పెంజెరువు వద్ద బుధవారం తూర్పు కాపు సంఘ పట్టణ సమావేశం ఏర్పాటైంది ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడిగా బొద్దపు శ్రీను ఎంపికయ్యారు. కార్యదర్శిగా నగిరెడ్డి గణేశ్, కోశాధికారిగా ఉటా సతీష్‌లతో పాటు మరింకొంత మందికి కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. వీరిని ఎంపీపీ బోదెపు గోవింద్, సంఘం జిల్లా ప్రతినిధులు కరణం శ్రీహరి, అడపా శేషగిరి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొర్లె నానాజీ, మాజీ ఎంపీపీ బొద్దపు యర్రయ్యదొర, నేతలు దాసరి కుమార్, కోడిగుడ్ల రమణబాబు, కొఠారు కొండబాబు, కొఠారు నరేష్ అభినందించారు. నాయకులు నక్కా వెంకటరమణ, నక్కా శివ శంకర్, నరేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులు కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ



కొవ్వొతులతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినులు

ఎలమంచిలి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : విశాఖలో విద్యార్థినికి చోటుచేసుకున్న సంఘటనను నిరసిస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి ఎలమంచిలిలో విద్యార్థినులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎం.రమణ మాట్లాడుతూ మహిళలపై దాడులను అరికట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. విశాఖలో జరిగిన ఘటనలో బాధ్యులను కఠినంగా శిక్షించాని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు కె.అర్జున్, అభిషేక్, లక్ష్మణ్, భవానీ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు.

ఇద్దరు భక్తులకు తప్పిన ప్రమాదం

ఎలమంచిలి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జంపపాలేనికి వెళ్లే ప్రధాన రోడ్డు పక్కన బుధవారం పెద్ద ప్రమాదం తప్పింది. కల్వర్టు దెబ్బతినడంతో ఈ మార్గంలో ప్రయాణిస్తున్న కారు కల్వర్టులో కూరుకుపోయింది. ఇద్దరు అయ్యప్ప భక్తులు ప్రమాదం నుంచి బయటపడ్డారు. స్థానికులు వీరిని రక్షించి, కారును జేసీబీ సాయంతో బయటకు తీశారు.

విజ్ఞాన వీచికలు గ్రంథాలయాలు

» వారోత్సవాల ముగింపోత్సవంలో వక్తలు » వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు ప్రదానం



అచ్యుతాపురం గ్రంథాలయంలో మాట్లాడుతున్న సీఐ గణేశ్

అచ్యుతాపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని అచ్యుతాపురం సీఐ నమ్మి గణేశ్ అన్నారు. గ్రంథాలయాల వారోత్సవాలు ముగిసిన సందర్భంగా బుధవారం ఇక్కడి గ్రంథాలయంలో ఏర్పాటైన వేడుకల్లో ముఖ్య అతిథిగా మాట్లాడారు. పోటీ పరీక్షల పుస్తకాలు గ్రంథాలయాల్లో అందుబాటులో ఉంటాయని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అచ్యుత పాఠశాలల కరస్పాండెంట్ పల్లి శేషగిరిరావు, ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎం.పద్మ, గ్రంథాలయాధికారి బి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఎలమంచిలి: పుస్తక పఠనంతో విజ్ఞానం పెరుగుతుందని పలువురు అధ్యాపకులు, ఉపాధ్యాయులు అన్నారు. ఇక్కడి గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వారోత్సవాలు బుధవారం ముగిసిన సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమంలో మాట్లాడారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. గ్రంథాలయాధికారి ఆనంద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు డాక్టర్ చంద్రశేఖర్, ఎం.విజయ్‌కుమార్, కొక్కిరాపల్లి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.మాణిక్యం, ఉపాధ్యాయుడు వనుం నాగేశ్వరరావు, సీపీ బంగారుశెట్టి, విశ్రాంత అధ్యాపకుడు ఆడారి పూరీ జగన్నాథం, షేక్ అబ్దుల్లా, కె.మాయాదేవి, ఎన్.సత్యావాకర్స్ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

మునగపాక : గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో బి.ఎస్.శివనాయుడు పిలుపు నిచ్చారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో బుధవారం వారోత్సవాలు ముగిసిన సందరంగా ఏర్పాటైన కార్యక్రమంలో మాట్లాడారు. పుస్తక పఠనం ద్వారా విజ్ఞానం పెరుగుతుందన్నారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్.ఎం ఎం.శ్రీనువాసరావు, విశ్రాంతి ఉపాధ్యాయుడు పెంటకోట తులసీరావు, సీఆర్పీ బొడ్డేడ అచ్యుత కృష్ణ, ఆడారి సతీష్‌కుమార్, కరుణాకర్, గ్రంథాలయాధికారి ఎల్.వి.రమణ పాల్గొన్నారు. గణపర్తి గ్రంథాలయంలో ఈ వేడుకల్లో విద్యార్థులు అటెండర్ అప్పలనర్స పాల్గొన్నారు.



ఎలమంచిలిలో బహుమతులు పొందిన వారితో అతిథులు

ప్రకృతి విపత్తు, అగ్నిప్రమాదాలపై అవగాహన



అగ్ని ప్రమాద సమయాల్లో జాగ్రత్తలు వివరిస్తున్న దృశ్యం

రాంబిల్లి,నంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి విపత్తులు, అగ్నిప్రమాదాల సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఇక్కడి హైస్కూల్ ఆవరణలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎన్‌డీఆర్ఎఫ్ పదో బెటాలియన్ ఇన్‌స్పెక్టర్ వై.సత్యనారాయణ మాట్లాడుతూ ప్రకృతి విపత్తులు, అగ్నిప్రమాలు జరిగినపుడు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ నర్సింగరావు, ఎలమంచిలి అగ్నిమాపక అధికారి డి.రాంబాబు, రాంబిల్లి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఆర్.రవికుమార్, హైస్కూల్ హెచ్ఎం వేణుగోపాల్, ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు

యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ 'ధూళి'కి సన్మానం



రంగనాయకులును సత్కరిస్తున్న నాగేశ్వరరావు, చలపతిరావు

ఎలమంచిలి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన ధూళి రంగనాయకులను బుధవారం ఇక్కడి టీడీపీ కార్యాలయంలో ఏపీఆర్‌డీసీ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు ఘనంగా సన్మానించారు. నాయకులు, కార్యకర్తల సమక్షంలో శాలువా కప్పి, స్వీట్లు తినిపించారు. పార్టీ ఆవిర్భావం నుంచి రంగనాయకులు సేవలు అందిస్తూనే ఉన్నారని ప్రశంసించారు. వీటిని గుర్తించే పార్టీ అధిష్ఠానం ఈ పదవికి ఎంపిక చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజాన సూర్య నాగేశ్వరరావు, ఆడారి రమణబాబు, ఆడారి ఆదిమూర్తి, గొర్లె బాబూరావు, నమ్మి రమణ, ఎస్.రమణబాబు, నానేపల్లి సుబ్బయ్యనాయుడు తదితరులతో పాటు పలువురు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

తీర ప్రాంతాల్లో సాగర్ కవచ్

» మెరైన్, నేవీ, లా అండ్ ఆర్డర్ పోలీసులు సయుక్తంగా నిర్వహణ

అచ్యుతాపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మెరైన్, నేవీ, లా అండ్ ఆర్డర్ పోలీసులు బుధవారం సంయుక్తంగా సాగర్ కవచ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల పరిధిలో గల తీరప్రాంతాల్లో ఉగ్రవాదులు, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడేవారిని ఎలా గుర్తించి పట్టుకోవాలని అనే అంశంపై ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. ఈ సందర్భంగా పూడిమడక తీరంలో భారీగా పోలీసులు మోహరించారు. అలాగే పూడిమడక తీరంనుంచి అచ్యుతాపురం వైపు వెళ్లే దారులన్నింటిలో పోలీసు బందోబస్తు నిర్వహించి, తనిఖీలు చేపట్టారు. మెరైన్ సీఐ సింహాద్రి నాయుడు ఆధ్వర్యలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసు అధికారులు

25న రామలింగేశ్వర స్వామి కల్యాణోత్సవం

మునగపాక, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాటిపల్లి గ్రామంలో రామలింగేశ్వరస్వామి ఆలయ వార్షిక కళ్యాణం ఈ నెల 25న జరుగుతుంది. ఇందుకు సంబంధించి భారీ ఏర్పాట్లు చేపడుతున్నట్టు ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయం ఆవరణలో బుధవారం పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. సోమవారం వేకువజాము నుంచి విశేష పూజలు ప్రారంభం కానున్నాయన్నారు. మధ్యాహ్నం అన్న సమారాధన, కల్యాణోత్సవం, సారె ఊరేగింపు వంటివి ఉంటాయని వివరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనాల్సిందిగా కోరారు.

నేడు గవర కార్పొరేషన్ డైరెక్టర్ 'భీమరశెట్టి' ప్రమాణం

మునగపాక, నవంబర్ 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిమ్మరాజుపేట గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు భీమరశెట్టి శ్రీనివాసరావు గురువారం రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్‌గా ప్రమాణం చేయనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందాయి. విజయవాడ బీసీ భవన్‌లో చైర్మన్‌తో పాటు డైరెక్టర్లు ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈ సందర్భంగా అతనిని ఏపీఆర్‌డీసీ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు శ్రీనివాసరావును సత్కరించి అభినందించారు.

జగన్‌ను కలిసిన ఎంపీపీ గోవింద్



ఎలమంచిలి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం జగన్‌ను ఎలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్ తదితరులు బుధవారం కలిశారు. తాడేపల్లిలోని ఆయన నివాసానికి వెళ్లి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. నిత్యం ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని జగన్ ఆదేశించినట్టు ఇక్కడి విలేకరులకు గోవింద్ తెలిపారు.

'జిల్లా రోడ్లకు టాక్స్ వసూళ్లు తగదు'

అనకాపల్లి టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లా రోడ్లకు కూడా టోల్ గేట్లు పెట్టి ట్యాక్స్ వసూలు చేయాలని నిర్ణయిస్తుండడం అన్యాయమని సీపీఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ అన్నారు. బుధవారం ఇక్కడ జరిగిన పార్టీ సమావేశంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం తగదన్నారు. ఈ విషయమై ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరారు. నాయకులు కె.తేలయ్యబాబు, బి.ఉమామహేశ్వరరావు, సుభాషిణి, నూకఅప్పారావు పాల్గొన్నారు.

రైతులకు తెలియకుండా భూముల సర్వే ఎలా చేస్తారు..?



సర్వే ఎలా చేస్తారని ప్రశ్నిస్తున్న సీపీఎం నాయకులు, రైతులు

నక్కపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రైతులకు తెలియకుండా నక్కపల్లి, ఎస్.రాయవరం మండలాల్లో భూముల సర్వే ఎలా చేస్తారని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు, రైతులు ప్రశ్నించారు. బుధవారం పెదతీనార్ల, చినతీనార్ల గ్రామాల్లో ఆయన మత్స్యకారులు, రైతులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ విధమైన సమాచారం ఇవ్వకుండా అధికారులు పెదతీనార్ల, చినతీనార్ల, గుర్రాజుపేట గ్రామాల్లో జిరాయితీ భూములను ఎందుకు సర్వే చేస్తున్నారని ప్రశ్నించారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం రైతులకు తెలియకుండా, ఆమోదం లేకుండా ఎవరూ వారి భూముల్లోకి వెళ్లకూడదని స్పష్టం చేశారు. తక్షణమే ఈ సర్వేలను నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.సత్యనారాయణ, సీఐటీయూ మండల కన్వీనర్ ఎం.రాజేశ్, నాయకులు ఎం.లోవరాజు, ఎం.మధు, కాశీసోమేరు, పి.లోవరాజు, కె.నాగమణి పాల్గొన్నారు.

సచివాలయాల కార్యదర్శులతో ఎంపీడీవో సమీక్ష



కార్యదర్శులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీడీవో డీ సీతారామరాజు

నక్కపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సచివాలయాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, ప్రభుత్వ పథకాల గురించి బుధవారం ఎంపీడీవో సీతారామరాజు సమీక్షా సమావేశం నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఈ సమావేశంలో స్వర్ణ పంచాయతీ వెబ్‌సైట్‌లో ఇంటి పన్నులు అప్‌లోడ్ చేయడం, సచివాలయ ఉద్యోగులకు బయోమెట్రిక్ హాజరు ప్రకారం జీతాలు అప్‌లోడ్ చేయడం, ఈ సర్వీసెస్ అమౌంట్‌ను ప్రతి రోజూ ప్రభుత్వ నిధులకు జమ చేయడం తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామ సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

రాష్ట్ర హాకీ జట్టుకు సాయిరాం ఎంపిక



హాకీ జట్టుకు ఎంపికైన విద్యార్థి సాయిరాంను అభినందిస్తున్న అధ్యాపకులు

ఎస్.రాయవరం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడ్డరోడ్డు శ్రీప్రజ్ఞ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న కొలనాటి సాయిరాం రాష్ట్ర హాకీ జట్టుకు ఎంపికయ్యాడు. కాకినాడలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-19 విభాగంలో ఈ నెల 16 నుంచి 19 వరకు నిర్వహించిన జిల్లా హాకీ ఛాంపియన్‌షిప్ పోటీల్లో సత్తాచాటి ఈ అవకాశం దక్కించుకున్నాడు. వచ్చే నెలలో జార్కండ్‌లో జరిగే నేషనల్ హాకీ పోటీల్లో ఆంధ్ర తరఫున సాయిరాం పాల్గొంటాడు. ఈ మేరకు విద్యార్థిని అధ్యాపకులు రాము, నూకరాజు, రాజు, ప్రవీణ్, ప్రకాష్, నాగరాజు అభినందించారు.





పాయకరావుపేట: విజేతలకు బహుమతులు అందిస్తున్న సీఐ అప్పన్న... కోటవురట్ల గ్రంథాలయంలో బహుమతులు ప్రధానం చేస్తున్న ఎంపీడీవో, ప్రిన్సిపాల్

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

» జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేశ్

పాయకరావుపేట, నవంబరు 20: గ్రంథాలయాలు విజ్ఞాన భాంగాగారాలని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేశ్ అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో బుధవారం జరిగిన 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిలుగా తోట నగేశ్‌తో పాటు టీడీపీ మండల అధ్యక్షులు పెదిరెడ్డి చిట్టిబాబు, పాయకరావుపేట సీఐ జి.అప్పన్న పాల్గొన్నారు. వారోత్సవాల్లో నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా తోట నగేశ్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించడానికి గ్రంథాలయాలు దోహదపడతాయన్నారు. మనిషి అభివృద్ధికి పేదరికం ఎపుడూ అడ్డుకాదని, అనుకున్నది సాధించాలన్న కృతనిశ్చయంతో కష్టపడితే విజయం సాధ్యమవుతుందన్నారు. పెదిరెడ్డి చిట్టిబాబు మాట్లాడుతూ విద్యార్థులు వివిధ అంశాల్లో పాల్గొని బహుమతులు సాధించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సీఐ జి.అప్పన్న మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో విద్యార్థులు చక్క.గా చదువుకుని ఎన్నో ఉన్నతమైన ర్యాంకులు సాధించాలన్నారు. విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి సాధించాలని కోరారు. అనంతరం పలువుర్ని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో యోగా గురువులు ప్రసాద్, కేఎస్ఎన్.మూర్తి, షేక్ సలీం, ఎం.సూర్యప్రకాష్, కేఎల్.సీతారామయ్య, కంభంపాటి వెంకటరమణ, ఇన్‌చార్జి లైబ్రేరియన్ వామాల లక్ష్మణరావు, గ్రామ పెద్దలు, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కోటవురట్లలో...

కోటవురట్ల: విద్యార్థులు గ్రంథాలయాలను వినియోగించుకొని ఉన్నత స్థాయికి చేరాలని ఎంపీడీవో కాశీవిశ్వనాథం పిలుపునిచ్చారు. గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దిన పత్రికలు చదవడం వల్ల విజ్ఞానం పెరుగుతుందని చెప్పారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుజాత మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థాయి ఎదగడానికి గ్రంథాలయాలు దోహదపడతాయన్నారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంఈవో రామారావు," వాచ్ఎం యేసుదాసు, గ్రంథాలయాధికారి అప్పలనాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

నక్కపల్లిలో...



నక్కపల్లిలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

నక్కపల్లి: మండలంలోని చినదొడ్డిగల్లులో గ్రంథాలయ వారోత్సవాలు బుధవారంతో ముగిశాయి. గ్రంథాలయాధికారి కె.జనార్దన్ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ముగింపు సమావేశానికి ఎంఈవో-2 వేమగిరి నూకరాజు, హైస్కూల్ హెచ్ఎం బి.కవిత, బండారు ఛారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి బండారు గోవిందరావు హాజరయ్యారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొల్లం చంద్రరావు, ఉపాధ్యాయులు ఎన్‌వీఎస్ ఆచార్యులు,వైస్ ఎంపీపీప వెలగా ఈశ్వరరావు, జనసేన నాయకుడు వెలగా సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

దార్లపూడిలో మరిడిమాంబ జాతర ఏర్పాట్లు

» గ్రామంలో వీధివీధినా భారీగా లైటింగ్ సెట్లు

ఎస్.రాయవరం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మేజరు పంచాయతీ దార్లపూడి గ్రామంలో మరిడిమాంబ జాతర మహోత్సవాన్ని భారీగా ఏర్పాట్లు చేశారు. గురువారం జరగనున్న పండగకు భారీగా లైటింగ్ సెట్లు వేశారు. గ్రామంలో అన్ని వీధులతో పాటు ప్రధాన రోడ్డు మార్గం మొత్తం రకరకాల విద్యుత్ లైట్లతో అలంకరించారు. అమ్మవారి పండుగ రోజున భారీ తీర్థం సాగడంతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు, భారీ బాణసంచా పేల్చడం పేల్చుతారు. జాతరకు ప్రతీ ఏటా పలు ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో జనాలు తరలి వస్తుంటారు. ఈ ఏడాది కూడా మరిడిమాంబ జాతరను తిలకించేందుకు అధికసంఖ్యలో జనాలు తరలిరానున్నారని ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. బుధవారం నుంచి బొమ్మల దుకాణాలు అలాగే తినుబండారాల దుకాణాల వారితో పాటు తదితరులు గ్రామంలో సందడి చేయడంతో ముందు రోజు నుంచే గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. మరిడిమాంబ జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ విభీషణరావు ఆధ్వర్యంలో భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.



ఆలయం వద్ద ఏర్పాటు చేస్తున్న భారీ లైటింగ్ సెట్... (ఇన్‌సెట్‌లో) అమ్మవారి ప్రతిమ

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు



పూజలు అందుకున్న స్వామివారు

ఎస్.రాయవరం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలం కేంద్రంలో కొలువైన అలవేలు మంగ, పద్మావతి సమేత వైభవ వేంకటేశ్వరస్వామి తొమ్మిదో కల్యాణ మహోత్సవానికి సంబంధించిన పూజా కార్యక్రమాలు బుధవారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు పండితులు విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, అంకురార్పణం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ నెల 23 వరకు జరిగే ఈ వేడుకల్లో 22న సాయంత్రం ఆరు గంటలకు వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ వైభవ వేంకటేశ్వరస్వామి వారి దివ్య లీలా కల్యాణ మహోత్సవాన్ని నేత్రపర్వంగా జరిపించనున్నారు. ఇందులో భాగంగా ఆలయం వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. మొదటి రోజు జరిగిన స్వామి వారి పూజా కార్యక్రమాల్లో అధికంగా భక్తులు పాల్గొన్నారు.

వరిలో రెల్లరాల్చు పురుగు నియంత్రణపై అవగాహన

నక్కపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వరిలో రెల్లరాల్చు పురుగుల నియంత్రణపై ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశంపై బుధవారం కాగిత గ్రామంలో ఏవో ఉమాప్రసాద్ అవగాహన కల్పించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు రెల్లరాల్చే పురుగు నియంత్రణ గురించి రైతులకు వివరించారు. పెర్మిత్రిన్ మందు ఎకరానికి 400 మిల్లీలీటర్ల వాడడం ద్వారా గింజ గట్టిపడిన దశలో రూ.400తో పురుగును నియంత్రించవచ్చునని చెప్పారు. పలు కారణాల వల్ల అర్హత వుండి పీఎం కిసాన్ లబ్ధి పొందని రైతులకు అర్హత కల్పించడం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాజేశ్, ఏఈ సాయికుమారి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాలవికాస్ వేడుకలు

ఎస్.రాయవరం, నంవబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడ్డరోడ్డులో ఉన్న శ్రీవిద్య పబ్లిక్ స్కూల్ వద్ద బుధవారం సత్యసాయి జిల్లా అధ్యక్షుడు కసిరెడ్డి అప్పలనాయుడు సమక్షంలో బాలవికాస్ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో పలు ప్రవేట్ పాఠశాలలకు చెందిన 200 మంది విద్యార్థులు హాజరయ్యారు. విద్యార్థులతో సత్యసాయి స్వామి వారికి గాయత్రి పారాయణం చేయించారు. అలాగే బాలవికాస్ గురువు ఎన్‌వీఎస్ విశ్వేశ్వరరావు బాలవికాస్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. గ్రూపు-2 విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల కరస్పాండెంట్‌లు, ఇన్‌చార్జులు గణేష్, రాజశేఖర్, జిల్లా మహిళా యూత్ కో-ఆర్డినేటర్ భారతి తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా పశుగణన

▸▸ జిల్లా పశు సంవర్థక శాఖాధికారి డాక్టర్ రామ్మోహన్



వెంకుపాలెంలో పాడి రైతులతో మాట్లాడుతున్న డాక్టర్ రామ్మోహన్

కొత్తూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలంలో జరుగుతున్న పశుగణన సర్వేను జిల్లా పశు సంవర్థక శాఖాధికారి డాక్టర్ రామ్మోహన్ బుధవారం పర్యవేక్షించారు. తుమ్మపాల, వెంకుపాలెం గ్రామాల్లో పర్యటించి పశువులకు అందజేస్తున్న చికిత్సలను, వాటి ఆరోగ్య స్థితిగతులను పరిశీలించారు. ఈ సర్వే పక్కాగా సాగాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం పాడి పశువులకు వైద్యం సక్రమంగా అందుతున్నదీ లేనిదీ అక్కడి రైతులను అడిగి తెలుసుకున్నారు. పాడి పశువులకు ఎటువంటి అనారోగ్యం చేసినా సమీపంలోని పశువైద్య శాలను సంప్రదించాల్సిందిగా వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బి.సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

కబ్జాకు గురైన ప్రభుత్వ భూమి స్వాధీనం



స్వాధీనం చేసుకున్న భూమిని గ్రామ పెద్దలకు అప్పగిస్తున్న తహసీల్దార్

సబ్బవరం, నవంబరు 20 : మండలంలోని ఎల్లుప్పి గ్రామంలో కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ బి.చిన్నికృష్ణ మాట్లాడుతూ ఎల్లుప్పిలోని సర్వే నెంబరు 10/1సిలో ఎకరా ప్రభుత్వ భూమి ఉందన్నారు. సదరు భూమిని గతంలో శ్మశానవాటిక కోసం కేటాయించినట్టు చెప్పారు. ప్రస్తుతం ఖాళీగా ఉండడంతో కొంత మంది ఆక్రమించే ప్రయత్నం చేయగా, తమకు సమాచారం అందిందన్నారు. ఈ మేరకు సర్వే నిర్వహించి అందులోని ఆక్రమణలను తొలగించినట్టు చెప్పారు. అనంతరం ఆ భూమికి రక్షణ కల్పించే బాధ్యతను గ్రామ పెద్దలు ఉగ్గిన రాము, ఉగ్గిన గంగునాయుడుకు అప్పగించామని వివరించారు. శ్మశాన స్థలం చుట్టూ ముళ్ల కంచె ఏర్పాటు చేయాలని సూచించినట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో ఎం.గోవిందరావు, సర్వేయర్ లెంక శ్యామ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే యువతకు ఉజ్వల భవిష్యత్తు



సభ్యత్వ నమోదులో పాల్గొన్న కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్

లంకెలపాలెం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : టీడీపీతోనే రాష్ట్రానికి మంచి భవిష్యత్తు అని జీవీఎంసీ 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ అన్నారు. ఇక్కడి గంజిపేటలో కాలనీలో బుధవారం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రజా సంక్షేమంతో పాటు యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. అనంతరం ఆయన పలువురికి సభ్యత్వాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బొండా రమణ, పూసల శ్రీనివాసరావు, గంజి రాజు, అప్పలరాజు, సిపాన వాసు, తరసాల అప్పారావు, శివ, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప అంబలం పూజ



అయ్యప్పస్వామికి పూజ నిర్వహిస్తున్న భక్తులు

అనకాపల్లి టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గవరపాలెం పీలావారి గౌరీ పరమేశ్వరుల ఆలయం వద్ద బుధవారం రాత్రి అయ్యప్ప స్వామి అంబలం పూజను అత్యంత ఘనంగా నిర్వహించారు. గురుస్వామి యల్లపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజా కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో అయ్యప్ప భక్తులు హాజరయ్యారు. శరణుఘోషతో పాటు వారు ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఎమ్మెల్సీ శ్రీనివాసుల నాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ గాదే శ్రీనివాసుల నాయుడు

లంకెలపాలెం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల సమస్యలను ఎన్నో పరిష్కరించానని మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసుల నాయుడు అన్నారు. పెదముషిడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఏర్పాటు చేసిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్సీ ఓటర్లగా నమోదు కాని ఉపాధ్యాయులు రెండో విడత ఈనెల 27న తేదీ నుంచి డిసెంబరు 10వరకు అవకాశం ఉందన్నారు ఈ అవకాశాన్ని ఉపాధ్యాయులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రస్తుతం పాఠశాలల నిర్వహణ సమయం ఉదయం 9 నుంచి 4 గంటల వరకు కొనసాగుతున్నాయని ఇదే సమయం అనుకూలంగా ఉందన్నారు. ఈ పద్ధతిలో పాఠశాలలు కొనసాగేలా ప్రభుత్వం దృష్టికి వెళ్లామన్నారు. పాఠశాల నిర్వహణ సమయం మార్పులు చేస్తే గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులు ఇబ్బందులు పడే అవకాశం ఉందన్నారు. ఈ సమావేశంలో పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దినాయుడు, పరవాడ మండల కమిటీ నాయకులు కోవెల రవి, కొండబాబు, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా జంక్షన్లు

▸▸ తరచూ ఏదో ఒకచోట సంఘటనలు
▸▸ కానరాని హెచ్చరిక బోర్డులు, సిగ్నల్ లైట్లు
▸▸ పట్టించుకోని ఆర్అండ్‌బీ, పోలీస్ శాఖల అధికారులు
▸▸ ఆందోళన చెందుతున్న స్థానికులు



హెచ్చరిక బోర్డులు, సిగ్నల్స్ లేని మండల పరిషత్ వద్ద వై.జంక్షన్

పరవాడ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న పరవాడ ప్రాంతంలోని పలు రహదారి కూడళ్లు ప్రయాణికుల్లో వణుకు పుట్టిస్తున్నాయి. ప్రతి రోజూ ఏదో ఒకచోట ప్రమాదం జరుగుతుండడం సర్వసాధారణమైంది. ముఖ్యంగా బంగ్లా జంక్షన్, సినిమాహాల్ జంక్షన్, మండల పరిషత్ జంక్షన్, సింహాద్రి జంక్షన్, ఊటగెడ్డ జంక్షన్‌లు ప్రయాణికుల పాలిట శాపంగా మారాయి. కూడళ్ల వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాల్సిన ఆర్అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం మానేశారు. దీనివల్ల తరచూ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి.

ఎలమంచిలి- గాజువాక రహదారి మరీ రద్దీ

ఎలమంచిలి- గాజువాక ప్రధాన రహదారి గుండా ప్రతి రోజూ అధిక సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగిస్తుంటాయి. ఇదే రహదారిలో బంగ్లా జంక్షన్, సినిమాహాల్ జంక్షన్, ఊటగెడ్డ జంక్షన్‌లు ఉండడం ప్రమాదాలు పెరగడానికి కారణమవుతున్నాయి. ఎన్టీపీసీ, ఎస్ఈజెడ్ ఫార్మాసిటీ పరిశ్రమలకు వెళ్లే వారంతా ఈ జంక్షన్‌లను దాటుకొని వెళ్లాల్సి ఉంటుంది.

సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేయాల్సి ఉన్నా..

వాహనాల రద్దీ అధికంగా ఉన్నా నాలుగు రోడ్ల కూడళ్ల వద్ద సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేయలేకపోతున్నారు. ఫలితంగా ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. అలాగే పాదచారులు, ద్విచక్ర వాహనదారులు కూడళ్లు దాటి వెళ్లాలంటే హడలిపోతున్నారు. కూడళ్లు దాటే క్రమంలో ఎక్కువగా వృద్ధులు,



ప్రమాదకరంగా ఉన్న పరవాడలోని బంగ్లా కూడలి



తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్న సినిమాహాల్ కూడలి

చిన్నపిల్లలు ప్రమాదాలకు గురవుతున్నారు. సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేస్తే ప్రమాదాలను అరకట్టవచ్చు. కానీ అధికారులు ఈ దిశగా ఆలోచన చేయలేకపోతున్నారు.

మితిమీరిన వేగంతో బొగ్గు లారీలు రాకపోకలు

గత కొంత కాలంగా ఈ ప్రాంతం గుండా బొగ్గు లారీల రాకపోకలు అధికమయ్యాయి. మితిమీరిన వేగంతో వెళ్లి వస్తుండడం వల్ల కూడళ్లలోని రహదారులు పూర్తిగా దెబ్బతింటున్నాయి. దీంతో ఇటుగా రాకపోకలు సాగించే ప్రయాణికులు మరింత భయాందోళనకు గురవుతున్నారు. పోలీస్, ఆర్అండ్‌బీ శాఖల అధికారులు ఇప్పటికైనా స్పందించి కూడళ్ల వద్ద ట్రాఫిక్ సిగ్నల్ లైట్లతో పాటు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని పారిశ్రామిక ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

కానరాని ట్రాఫిక్ పోలీసులు

ఇదిలావుంటే, ఇక్కడ వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు కూడళ్ల వద్ద ట్రాఫిక్ పోలీసులు లేకపోవడం విచిత్రం. ముఖ్యంగా రాత్రి సమయాల్లో కూడళ్ల మీదుగా ప్రయాణించాలంటే భయాందోళన చెందుతున్నారు. లైట్లు లేకపోవడంతో చిమ్మచీకట్లు ఆవహిస్తున్నాయి. ఈ సమయంలో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు వాపోతున్నారు.

తరుచూ ప్రమాదాలు



కూడళ్ల వద్ద తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనాలు అతి వేగంగా రాకపోకలు సాగించడం, దీనికి తోడు ఇక్కడ సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేయకపోవడం ఇందుకు కారణంగా తెలుస్తోంది. ఆర్అండ్‌బీ అధికారులు తక్షణమే స్పందించి తగిన ఏర్పాట్లు చేపట్టాలి

- రెడ్డి నరసింగరావు, పరవాడ

కూడళ్లు దాటి వెళ్లాలంటే భయం



ఏదైనా పని మీద వెళ్లేటప్పుడు కూడళ్లను దాటుకొని వెళ్లాల్సి వస్తే భయాందోళనకు గురవుతున్నాం. వాహనాలు అతివేగంగా రాకపోకలు సాగించడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాల్సిఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

- గండి వాసు, పరవాడ

'వాష్'పై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలి

▸▸ అధికారుల శిక్షణ శిబిరంలో డీఆర్‌డీఏ పీడీ సచీదేవి



శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ సచీదేవి

సబ్బవరం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న వాటర్, శానిటేషన్, హైజిన్ (వాష్) కార్యక్రమంపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని డీఆర్‌డీఏ పీడీ కె.సచీదేవి సూచించారు. ఇక్కడి వెలుగు కార్యాలయంలో ఏపీఎం సీహెచ్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం జిల్లాలోని ఏరియా కో-ఆర్డినేటర్లు, ఏపీఎంలు, సీసీలకు ఏర్పాటైన శిక్షణ శిబిరంలో మాట్లాడారు. నీరు, పారిశుధ్య, ఆరోగ్యంపై ముందుగా సీసీలు, ఏపీఎంలు, సిబ్బంది అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రజలు వ్యాధుల బారిన పడకుండా గ్రామస్థాయిలో పనిచేస్తున్న మహిళా సంఘాల సభ్యులకు, సమాఖ్య సభ్యులకు అవసరమైన సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. నీటి విలువ, వాడకం, నాణ్యత ప్రమాణాలు, జల్‌జీవన్ మిషన్, పారిశుధ్యం, సమాజ బాధ్యత, సంఘాల సభ్యుల సహకారం, పరిశుభ్రత తదితర అంశాలపై రిసోర్స్ పర్సన్లు ఆర్‌డబ్ల్యూఎస్ జిల్లా కో-ఆర్డినేటర్ పులయ్య, సీహెచ్‌వో. స్వర్ణలత, ఏపీఎం సీహెచ్.శ్రీనివాసరావు, ఏరియా కో-ఆర్డినేటర్ సత్యనారాయణ అవగాహన కల్పించారు.

నేడు పడమటమ్మ పుట్టుక మహోత్సవం

▸▸ కశింకోటలో భారీ ఏర్పాట్లు ▸▸ 200 మంది పోలీసులతో బందోబస్తు



పడమటమ్మ



కశింకోటలో లైటింగ్‌తో వేసిన అయోధ్యరాముని ఆలయం సెట్

కశింకోట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పేరొందిన పడమటమ్మ పుట్టుక మహోత్సవం గురువారం కశింకోటలో అత్యంత వైభవంగా జరగనుంది. ఇందుకు సంబంధించి ఉత్సవ కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. రెండేళ్లకు ఒకసారి వచ్చే ఈ మహోత్సవాన్ని పురస్కరించుకొని ఉత్సవ కమిటీ చైర్మన్ సిదిరెడ్డి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కశింకోటలో అయోధ్యరాముల వారి భారీ విద్యుత్ దీపాల సెట్టింగ్‌ను వేశారు. ఈ వేడుకల్లో భాగంగా గురువారం ఉదయం విస్సన్నపేట గ్రామంలో ఉన్న పడమటమ్మ లోవ నుంచి అమ్మవారి పల్లకిని తీసుకువచ్చి గ్రామ పురవీధుల్లో ఊరేగింపుగా తీసుకువెళతారు. ఉత్సవానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సీఐ అల్లు స్వామినాయుడు ఆధ్వర్యంలో 200మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

అసంఘటిత కార్మికులకు పథకాలు అందించాలి



కార్మిక శాఖ కార్యాలయాధికారికి వినతిని అందజేస్తున్న మాణిక్యాలరావు

కొత్తూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : అసంఘటిత కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని బహుజన సమాజ్ పార్టీ అనకాపల్లి ఇన్‌చార్జి సూదికొండ మాణిక్యాలరావు కోరారు. ఈ మేరకు బుధవారం స్థానిక కార్మిక శాఖ కార్యాలయంలో సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. రిక్షా కార్మికులకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై పూర్తి స్థాయిలో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. అవగాహన లేమి కారణంగా కార్మికులంతా ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాద బీమా తదితర పథకాలు వీరికి వర్తించేలా కార్మిక శాఖ అధికారులు కృషి చేయాలని కోరారు.

గ్రావెల్ అక్రమ తవ్వకాలపై దాడులు

రెండు ఎక్సకవేటర్లు, లారీ స్వాధీనం చేసుకున్న రెవెన్యూ, పోలీస్ అధికారులు



దాడుల్లో పాల్గొన్న రెవెన్యూ, పోలీసు సిబ్బంది

పరవాడ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : గ్రావెల్ అక్రమ తవ్వకాలపై రెవెన్యూ పోలీస్ అధికారులు బుధవారం రాత్రి సంయుక్తంగా దాడులు నిర్వహించారు. రెండు ఎక్సకవేటర్లు, గ్రావెల్ లోడుతో ఉన్న లారీని స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ఇందుకు సంబంధించి పరవాడ సీఐ మల్లికార్జునరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దేశపాత్రునిపాలెం రెవెన్యూ పరిధి సర్వే నంబరు 334లో గల ప్రభుత్వ భూమిలో కొంతమంది వ్యక్తులు రాత్రి సమయంలో గ్రావెల్‌ను కొంతకాలంగా గుట్టుచప్పుడు కాకుండా తరలించుకుపోతున్నారు. స్థానికుల సమాచారం మేరకు సీఐ మల్లికార్జునరావు, వీఆర్వో సాయికుమార్ సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించారు. తవ్వకాలకు ఉపయోగిస్తున్న రెండు ఎక్సకవేటర్లు, గ్రావెల్ లోడుతో ఉన్న లారీని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. గ్రావెల్ అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్న వ్యక్తి పి.బోనంగికి చెందిన వైసీపీ నాయకుడని ప్రచారంలో ఉంది.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

▸▸ వివిధ పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం



అనకాపల్లి గ్రంథాలయంలో బహుమతులు అందిస్తున్న ఎస్ఐ రాములమ్మ



కశింకోట గ్రంథాలయంలో...

అనకాపల్లి టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయ వారోత్సవాలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో ఏర్పాటైన వేడుకల్లో మహిళా పోలీస్‌స్టేషన్ ఎస్ఐ పి.రాములమ్మ మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞానాన్ని పెంపొందించే దేవాలయాలుగా పేర్కొన్నారు. అన్నివర్గాల ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. గ్రంథాలయాధికారి కె.శ్రీనివాసరావు, ప్రోగ్రామ్ అధికారి బల్లా నాగభూషణం, అరసము జిల్లా అధ్యక్షుడు జీఎల్ఎన్ శాస్త్రి, ఉపాధ్యాయురాలు రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కశింకోట : గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ అడబాల శ్రీనివాసరావు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో వారోత్సవాలు బుధవారం ముగిసిన సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఎంఈవోలు వెంకటసురేష్, సూర్య నారాయణమూర్తి, గ్రామీణ వికాస్ బ్యాంకు మేనేజర్ కవిత, సంఘ సేవకులు గురుదేవ్‌జీ, సిన్హ అప్పారావు, గ్రంథాలయాధికారిణి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పరవాడ : గ్రంథాలయ వారోత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఇక్కడి గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఉక్కు సాహితీ సమాఖ్య అధ్యక్షుడు కె.నాగ వెంకట ఆంజనేయులు హాజరై వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. తొలుత కవి సమ్మేళనం నిర్వహించారు. పద్యకవి కాండ్రేగుల వెంకట రామారావు, విశ్రాంత ఉద్యోగి జంగాల నాగేశ్వరరావు, గ్రంథాలయ రికార్డ్ అసిస్టెంట్ కె.వి.లక్ష్మణరావు, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

సబ్బవరం : గ్రంథాలయ వారోత్సవాల ముగింపోత్సవం సందర్భంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో ఏర్పాటైన కార్యక్రమానికి ఎంపీపీ బోకం సూర్యకుమారి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రంథాలయాల విశిష్టతను వివరించారు. అనంతరం వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఎంఈవో లక్ష్మణ రావు, సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, గ్రంథాలయాధికారిణి వి.శిరీషా, కొల్లి కృష్ణ, యర్రంశెట్టి రాము, ఉపాధ్యాయులు ప్రసాద్, కుమారి, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

హుండీ చోరీ సొత్తు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న సీఐ

సబ్బవరం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాయపుఅగ్రహారంలో గత నెల తొమ్మిదో తేదీన జరిగిన శ్రీకృష్ణుని ఆలయం హుండీ చోరీ కేసును సబ్బవరం పోలీసులు ఛేదించారు. ఇందుకు సంబంధించి నిందితుడు నాయుడుని మంగళవారం సాయంత్రం స్థానిక సినిమా హాలు సమీపంలో ఎస్ఐ సింహాచలం చాకచక్యంగా పట్టుకున్నట్టు సీఐ పిన్నింటి రమణ తెలిపారు. నిందితుని వద్ద రూ.11,554 నగదు, బైక్, సెల్ ఫోన్, చోరీకి వినియోగించిన పరికరాలను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. అనంతరం బుధవారం అనకాపల్లి కోర్టుకు తరలించారు.

'లా విద్యార్థిని అత్యాచార నిందితులను శిక్షించాలి'



అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న మహిళలు

పరవాడ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : లా విద్యార్థినిపై అత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఏపీ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం దేశపాత్రునిపాలెం అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి బూసి పరమేశ్వరి మాట్లాడుతూ సమాజంలో మహిళలకు రక్షణ కొరవడిందన్నారు. ప్రేమ పేరుతో ఆడపిల్లలను వంచించే మృగాలను శిక్షించేందుకు కఠినమైన శిక్షలతో చట్టాలను అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు కె.తులసీ, బి.సుగుణ, కె.రమణమ్మ, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

ఫార్మాసిటీకి నీటి సరఫరాను పునరుద్ధరించాలి

పరవాడ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఫార్మాసిటీకి గత మూడు రోజులుగా నీటి సరఫరా నిలిచిపోయిందని, తక్షణమే పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ బుధవారం కోరారు. నీటి సరఫరా లేకపోవడం వల్ల ఆ ప్రభావం కాంట్రాక్ట్ కార్మికులపై పడిందన్నారు. ఫార్మా యాజమాన్యాలు కాంట్రాక్ట్ కార్మికులను గతంలో వలే విధుల్లోకి తీసుకోవడం లేదని, ఉత్పత్తి సామర్థ్యాన్ని కూడా తగ్గించేస్తున్నాయని పేర్కొన్నారు. రాంకీ యాజమాన్యం బాధ్యతా రాహిత్యానికి తోడు ఏపీఐఐసీ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఇక్కడ ఈ పరిస్థితి నెలకొందన్నారు. ఈ సమస్యపై జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాల్సిందిగా ఆయన కోరారు.

పాడి రైతులకు హెరిటేజ్ అండ : ఆర్ఎం



అవగాహన సదస్సులో ఆర్ఎం తులసీనాయుడు తదితరులు

సబ్బవరం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పాడి రైతులకు హెరిటేజ్ డైరీ అన్నింటా అండగా ఉంటుందని డైరీ రీజినల్ మేనేజర్ తులసీనాయుడు అన్నారు. మండలంలోని పైడివాడలో పాడి రైతులకు ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. పాడి పశువులకు ఉచిత బీమా పథకాన్ని అమలు చేస్తున్నట్టు చెప్పారు. పాడి రైతులు ఎటువంటి ప్రీమియం చెల్లించకుండానే ప్రమాదవశాత్తు మరణిస్తే రూ. ఐదు లక్షలు, సహజ మరణానికి రూ.50 వేలు చెల్లించి ఆదుకుంటున్నట్టు వివరించారు. రోగాల బారిన పడిన పశువులకు ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నామన్నారు. పాడి ఉత్పత్తిని పెంచి తద్వారా రైతులు ఆర్థిక ప్రగతి సాధించాలని కోరారు. అనంతరం మినరల్ మిక్చర్ ప్యాకెట్లను రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ శీరం అప్పలరాజు, సూపర్‌వైజర్ నాని, గణేశ్, బలిరెడ్డి అప్పలరాజు, రాపర్తి కనకరాజు, నాగరాజు, తాతబాబు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల బిగింపు నిలిపివేయాలని వినతి

అనకాపల్లి టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ బోర్లు, గృహాలకు, వాణిజ్య సముదాయాలకు బిగిస్తున్న విద్యుత్ స్మార్ట్ మీటర్లను తక్షణమే నిలిపివేయాలని కోరుతూ ఈపీడీసీఎల్ ఎస్ఈ జి.ప్రసాద్‌కు బుధవారం సీపీఐ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చెల్లూరి నాగరాజు, కోరిబిల్లి శంకరరావు, అబ్బులు, వెంకటరమణ పాల్గొన్నారు.

చాలీచాలని గదుల్లో చదువులు

- నాడు- నేడు పథకం నిధులు విడుదలైనా నిర్మాణానికి నోచని అదనపు భవనాలు
- పోతంగి ప్రాథమిక పాఠశాలలో దుస్థితి


పోతంగి హెడ్‌క్వార్టర్‌లో శిథిలావస్థకుచేరిన పాఠశాల భవనాలు

డుంబ్రిగుడ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి నాలుగు కిలో మీటర్ల దూరాన పోతంగి పంచాయతీ హెడ్‌క్వార్టర్స్‌లోనున్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో వసతి లేమితో విద్యార్థులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. చాలీచాలని శిథిల భవనంలో చదువులు సాగిస్తున్నారు. దీంతోపాటు పాఠశాల ఎదుట షెడ్‌లో తరగతులు నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. ఈ పాఠశాలకు గత వైసీపీ పాలనలో నాడు- నేడు పథకం ద్వారా రూ. 4.7 లక్షల నిధులు మంజూరైనా, పాఠశాల మరమ్మతులు కానీ, అదనపు భవన నిర్మాణం కానీ, చేపట్టలేదని గ్రామానికి చెందిన గిరిజనులు ఆరోపిస్తున్నారు. దీనికితోడు గతంలో పాఠశాలకు అదనంగా (ఆనందలహరి భవనం) ఏర్పాటు చేశారు. ఇందుకోసం విడుదలైన నిధులు నిరుపయోగమయ్యాయయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదే సమయంలో నాడు-నేడు నిధులు మంజూరైనా వాటిని ఎందుకు పాఠశాలలో మౌలిక వసతుల కల్పనలో నిర్లక్ష్యం వహించారని ప్రశ్న తలెత్తుతోంది. ఫలితంగా ప్రస్తుతం పాఠశాలలో ఒకటో తరగతి ఐదో తరగతి వరకు చదువుతున్న 64 చిన్నారులకు తరగతి గదులు చాలక ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి తమ గ్రామ పాఠశాలకు మంజూరైన నిధులతో విద్యార్థులకు ఉపయోగకరంగా వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రధానంగా అదనంగా పాఠశాల భవన నిర్మాణాలు అవసరం ఎంతో ఉందని చెబుతున్నారు. ప్రస్తుతం కూర్చునేందుకు కూడా భవన సదుపాయం లేక చిన్నారులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. వర్షం వస్తే మరీ సమస్య ఎదుర్కొంటున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి అదనపు భవనాలు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

స్టాండింగ్ పాయింట్ల వద్ద అటవీ ఉత్పత్తులు కొనుగోలు

- కాశీపట్నం జీసీసీ బ్రాంచి మేనేజర్ మురళీకృష్ణ
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

అనంతగిరి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): దళారీ వ్యవస్థ నిర్మూలనతోపాటుగా స్టాండింగ్ పాయింట్ల వద్ద గిరిజనులు సేకరించిన ఉత్పత్తులను గిట్టుబాటు ధరతో కొనుగోలు చేయనున్నట్టు కాశీపట్నం జీసీసీ బ్రాంచి మేనేజర్ వి.మురళీకృష్ణ తెలిపారు. బుధవారం 'ఆంధ్రజ్యోతి' లో 'జీసీసీ దశ మారేనా' అనే శీర్షికతో వచ్చిన కథకానికి బ్రాంచి మేనేజర్ మురళీకృష్ణ స్పందించి మాట్లాడారు. వారపు సంతలపై ప్రత్యేక దృష్టిసారించి, స్టాండింగ్ పాయింట్ల వద్ద అటవీ ఉత్పత్తులను కొనుగోలుకు ఆదేశాలు జారీ చేశామన్నారు.తన పరిధిలోని 18 డీఆర్ డిపోల భవనాలకు సంబంధించి మరమ్మతులు నిమిత్తం ప్రతిపాదనలు పంపించామన్నారు. కాశీపట్నం బ్రాంచి పరిధిలోని ఎస్. కోట వద్ద ఎంఎఫ్‌సీ గొడౌన్ మరమ్మతులకు కారణంగా అటవీ ఉత్పత్తులను సుంకరమెట్టగొడౌన్ లో నిల్వఉంచుతున్నామన్నారు. అలాగే, 2023-24 సంబంధించి రూ. 58 లక్షలతో అటవీ ఉత్పత్తులు కొనుగోలు చేశామని, 2024-25లో కాఫీ కొనుగోలుకు ప్రత్యేక ప్రణాళికలను రూపొందించినట్టు వివరించారు. అటవీ ఉత్పత్తులను గిరిజనులు జీసీసీకే విక్రయించేలా వారికి అవగాహన కల్పిస్తున్నట్టు ఆయన తెలిపారు.

విద్యుత్ షార్టు సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం


చింతలపూడిలో దగ్ధమవుతున్న పూరిల్లు

కొయ్యూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): చింతలపూడిలో విద్యుత్ షార్టు సర్క్యూట్‌తో జరిగిన అగ్నిప్రమాదంలో పూరిల్లు దగ్ధమైంది. వివరాలివి.. బుధవారం ఉదయం పుట్టా సత్యనారాయణతో పాటు కుటుంబ సభ్యులు వ్యవసాయ పనులకు పొలానికి వెళ్లారు. ఇంతలో ఆయన ఇంట్లోని విద్యుత్ మీటరు నుంచి మంటలు చెలరేగాయి. గ్రామస్తులు మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించినా ఫలితంలేకపోయింది. బాధితుని ఇంట్లో దాచిన రూ 1.50 లక్షల నగదు, వెండి, బంగారంతోపాటు విలువైన గృహోపకరణాలు, తిండి గింజలు, దుస్తులు కాలిబూడిదయ్యాయి. విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ మండల నాయకురాలు శ్యామల వరలక్ష్మి ఈ కుటుంబాన్ని పరామర్శించారు. ప్రభుత్వం ఆదుకునేలా చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు.

బొర్రాలో పార్కింగ్ స్థలం గుర్తింపు


పార్కింగ్ స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎంపీడీవో

అనంతగిరి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రాగుహలు వద్ద పార్కింగ్ సమస్య తలెత్తడంతో.. సబ్ కలెక్టర్ ఆదేశాల మేరకు.. తహసీల్దార్ మాణిక్యం, ఎంపీడీవో ఏవీవీకుమార్ బుధవారం అక్కడికు వెళ్లి పరిశీలించారు. గుహల ప్రాంగణంలో 3.4 ఎకరాల భూమిని పార్కింగ్ స్థలంగా గుర్తించారు. ఈమేరకు ఉన్నతాధికారులకు నివేదికను అందజేశారు. అనంతరం అధికారులుస్థానిక సర్పంచ్ జన్ని అప్పారావు, ఎంపీటీసీ సభ్యురాలు అరుణతో కలిసి, హోటల్స్ యాజమానులకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ నిషేధించాలని, పారిశుధ్యం మెరుగునకు సహకరించాలన్నారు. ప్రతి హోటల్ వద్ద డస్ట్‌బిన్లు ఏర్పాటు చేసుకోవాలని అధికారులు ఆదేశించారు.

చింతపల్లి ఎంపీడీవోగా శ్రీనివాసరావు


శ్రీనివాసరావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపీపీ అనుషదేవి, జెడ్పీటీసీ బాలయ్య

చింతపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవోగా యూఎస్‌వీ శ్రీనివాసరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గత కొంత కాలంగా ఎంపీడీవోగా పనిచేస్తున్న పి. ఆశాజ్యోతి దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. దీంతో జడ్పీసీఈవో స్థానిక ఈవోఆర్‌డీ శ్రీనివాసరావుకి ఎంపీడీవోగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆయనను ఎంపీపీ కోరాబు అనుషదేవి, జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, కార్యదర్శులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో రవీంద్రనాథ్, ఏఈఈ బాలకిశోర్, వైస్‌ఎంపీపీ వెంకగలరావు, శారద, కోఆప్షన్ సభ్యుడు నజర్‌వల్లి పాల్గొన్నారు.

వంజంగి మేఘాల కొండపై పారిశుధ్యం మెరుగుపర్చాలి

- డివిజనల్ పంచాయతీ అధికారి కుమార్


వంజంగిలో పర్యాటక ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పాడేరురూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పర్యాటక ప్రాంతమైన వంజంగి మేఘాల కొండపై యుద్ధ ప్రాతిపదిక పారిశుధ్యం మెరుగుపర్చాలని డివిజనల్ పంచాయతీ అధికారి పీఎస్ కుమార్ సూచించారు. బుధవారం సాయంత్రం ఆయన వంజంగి గ్రామాన్ని సందర్శించి పారిశుధ్యం పనులను పర్యవేక్షించారు. ఐటీడీఏ పీవో జారీ చేసిన ఆదేశాలను విధిగా పాటించాలన్నారు. ఎంపీడీవో, ఈవోఆర్డీ వంజంగిలో తరచూ పర్యటించాలని, పాడేరు నుంచి మేఘాల కొండ వరకు రోజూ పారిశుధ్య పనులు చేపట్టాలని, ప్లాస్టిక్ వ్యర్థాలను ఎప్పటికి అప్పుడు తొలగించి పర్యాటకులకు అసౌకర్యం కలగకుండా చూడాలని సూచించారు. వంజంగిలో రిసార్ట్‌లు, టెంట్‌లు క్రమబద్ధీకరించాలన్నారు. ప్రతీ రిసార్ట్ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా యాజమాన్యాలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.డేవిడ్‌రాజ్, ఈవోఆర్డీ రమేశ్ పాల్గొన్నారు.

47 మందికి కుటుంబ సంక్షేమ శస్త్ర చికిత్సలు

చింతపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోరుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం 47 మందికి కుటుంబ సంక్షేమ శస్త్రచికిత్సలు చేసినట్టు లోతుగెడ్డ పీహెచ్‌సీ వైద్యాధికారి లక్ష్మీకాంత్ తెలిపారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ తనతోపాటూ ధారకొండ పీహెచ్‌సీ వైద్యాధికారి డీకే హిమబిందు, కోరుకొండ వైద్యాధికారి శివ ప్రసాద్ ఆధ్వర్యంలో పురుషులకు ఈ శస్త్రచికిత్సల్లో పాల్గొన్నట్టు చెప్పారు. ఇతర పీహెచ్‌సీల్లోనూ ప్రత్యేక కుటుంబ సంక్షేమ శస్త్రచికిత్సలు కొనసాగిస్తామని ఆయన తెలిపారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

పాడేరురూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఒడిశా నుంచి గంజాయి అక్రమ రవాణా జరుగుతున్నట్లు సమాచారం రావడంతో పాడేరు పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈ నేపథ్యంలో ప్రతీ వాహనాన్ని తనిఖీ చేస్తున్నారు.

ఘనంగా సారె ఊరేగింపు


గౌరీ పరమేశ్వరుల సారె తీసుకువెళ్తున్న మహిళా భక్తులు

పాడేరురూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో బుధవారం సారె ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయంలో సారెను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ నెల 30వ తేదీ వరకు నిర్వహించనున్న గౌరీ పరమేశ్వరుల మాసోత్సవాల్లో బబగంగా ఈ కార్యక్రమం చేపట్టారు. ఈనెల 25న పసుపు కుంకుమల పంపిణీ చేస్తామని సంఘం సభ్యులు కొణతాల సతీశ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు ఎం.పరమేశ్వరరావు, కె.వెంకటరావు, డి.బుజ్జి, వై.మోహన్, ఎస్.మధు, సాయి, కొండబాబు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి థాంగ్ టా మార్షల్ ఆర్ట్స్ క్రీడా పోటీలు


పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

పాడేరురూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పాడేరులోని ఇన్‌డోర్ స్టేడియంలో అండర్ 14, 17, 19 బాల బాలికల రాష్ట్రస్థాయి థాంగ్ టా మార్షల్ ఆర్ట్స్ క్రీడా పోటీలను బుధవారం స్థానిక ఎమ్మెల్యే ఎం. విశ్వేశ్వరరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల పట్ల ఆసక్తి కలిగి ఉండాలన్నారు. డీఈవో పి.బ్రహ్మాజీరావు మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలూ ఎంతో అవసరమన్నారు. డీఎస్‌డీవో ఎ.జగన్మోహన్‌రావు, స్కూల్ గేమ్స్ సెక్రటరీ వి.కొండబాబు, పరిశీలకుడు ఎన్.శ్రీహరిరాజు, స్కూల్ గేమ్స్ మాజీ సెక్రటరీ సూరిబాబు, తలారిసింగి పాఠశాల హెచ్ఎం సుమిత్ర, వ్యాయామ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షులు సింహాచలం, ఆర్గనైజింగ్ సెక్రటరీ భూపతిరాజు, సూరిబాబు, తులసీరావు, వివిధ జిల్లాలకు చెందిన 90 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో పాడేరు సెయింటాన్స్ స్కూల్‌లో 8వ తరగతి విద్యార్థిని మినుముల నాగసాయి తణ్మయి అండర్ -11లో మొదటి స్థానం సాధించించినట్టు కరాటే క్లబ్ ఛీఫ్ ఇన్‌స్ట్రక్టర్ బాకూరు పాండురాజు తెలిపారు. ఈ విద్యార్థినిని ప్రిన్సిపాల్ సిస్టర్ షినా, పీడీలు గణేష్, పరశురామ్, సిబ్బంది అభినందించారు.

ఎస్.కోటలో జీసీసీ గొడౌన్ పరిశీలన


జీసీసీ చైర్మన్ శ్రావణ్‌కుమార్‌ను కలిసిన జీసీసీ ఉద్యోగులు

అనంతగిరి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీసీసీ కాశీపట్నం బ్రాంచి పరిధి ఎస్.కోటలోనున్న ఎంఎఫ్‌పీ గొడౌన్‌ను జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ బుధవారం పరిశీలించారు.. అనంతగిరి మండల పరిధిలోని స్టాండింగ్ పాయింట్ల వద్ద గిరిజనులు నుంచి కొనుగోలు చేస్తున్న అటవీ ఉత్పత్తులు నిల్వకోసం ఎస్.కోట ఎంఎఫ్‌పీ గొడౌన్ ఉపయోగించేవారని, అయితే అది శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రస్తుతం సుంకరమెట్ట గొడౌన్‌ను ఉపయోగిస్తున్నట్లుగా జీసీసీ మేనేజర్ మురళీకృష్ణ ఈసందర్భంగా కిడారికి వివరించారు. బాధ్యతలు స్వీకరించి, మొదటిసారిగా విచ్చేసిని కిడారి శ్రావణ్ కుమార్‌కు, సిబ్బంది మర్యాదపూర్వకంగా శుభాకాంక్షలు తెలిపారు. చైర్మన్‌ను కలిసి వారిలో అప్పన్నదొర, ముత్యాలు, అప్పలస్వామి, బలరాం, తదితరులు ఉన్నారు.

ఎనిమిది మంది వాహనదారులకు జరిమానా


వాహనాల తనిఖీలో ఆర్‌టీఓ వాసు

డుంబ్రిగుడ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ వాసు ఆధ్వర్యంలో బుధవారం వాహనాల తనిఖీ విస్తృతంగా చేపట్టారు. లైసెన్సులు లేని, హెల్మెట్లు ధరించని, నిబంధనలు పాటించాలని ఎనిమిదిమందికి జరిమానా విధించారు. ఆర్‌టీవో వాసు ఈ సందర్భంగా మాట్లాడుతూ, డ్రైవింగ్ లైసెన్స్‌లు పక్కగా ఉండాలని, ప్రైవేట్ వాహనదారులు నిబంధనల మేరకే ప్రయాణికులను ఎక్కించాలని, లేని పక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు.

పాత పింఛన్ విధానం అమలు చేయాలి

- ఏపీసీపీఎస్‌ఈఏ జిల్లా అధ్యక్షుడు ఈశ్వరరావు


మహాసభ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీపీఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు

చింతపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సీపీఎస్ రద్దుచేసి పాత పింఛన్ విధానం అమలు చేయాలని ఏపీసీపీఎస్‌ఈఏ జిల్లా అధ్యక్షుడు మాసాడా ఈశ్వరరావు డిమాండ్ చేశారు. బుధవారం చింతపల్లి బాలుర ఆశ్రమ పాఠశాలలో సీపీఎస్ ఉద్యోగులు డిసెంబరు 10వ తేదీన విజయవాడలో నిర్వహించనున్న మహాసభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ పాత పింఛన్ సాధన కోసం ఉద్యమాన్ని ముందుకు తీసుకువెళతామన్నారు. విజయవాడలో తలపెట్టిన మహాసభకు జిల్లా నుంచి అత్యధిక సంఖ్యలో సీపీఎస్ ఉద్యోగులు హాజరుకావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కుడుముల వెంకటరమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాలానుగుణంగా ఉపాధి పనులు కల్పన : ఏపీవో


మాట్లాడుతున్న ఏపీవో సంఘం నాయుడు

ముంచంగిపుట్టు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కాలానికి అనుగుణంగా ఉపాధి హామీ పనులను కల్పించనున్నట్టు ఏపీవో సంఘంనాయుడు అన్నారు. మండలంలో ని సుజనకోట పంచాయతీ కుమ్మరిపుట్టులో ఉపాధి హామీ పనులపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కాలమాన పట్టికను వేసి ఏడాదిలో ఏ నెలలో ఎన్ని పని దినాలు, ఏ పనులు కల్పిస్తారో అనే విషయాన్ని వివరించారు. ఈ సందర్భంగా ఏపీవో మాట్లాడుతూ ఉపాధి కూలీలు 100 రోజుల పని దినాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచి వి.రమేష్, ఉపాధి సిబ్బంది, వేతనదారులు పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు


బహుమతులు పొందిన విద్యార్థులతో లైబ్రేరియన్, ఉపాధ్యాయులు

పాడేరురూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పాడేరు శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు బుధవారంతో ముగిశాయి. వారం రోజులుగా వివిధ పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన క్విజ్, డ్రాయింగ్, మ్యూజికల్‌చైర్, పాటలు తదితర పోటీల్లో విజేతలకు బహుమతులందజేశారు. వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించిన గ్రంథాలయాధికారి మోరి సత్యవతిని ఉపాధ్యాయులు, పాఠకులు ఈ సందర్భంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వన్నెపూరి భీమ్‌నాయుడు, శెట్టి కన్నయ్య, కేశవ, సీతమ్మ, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ప్రభుత్వ డిగ్రీకళాశాల్లో ప్రిన్సిపాల్ డాక్టర్.వనుము చిట్టబ్బాయి ఆధ్వర్యంలో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని ఘనంగా చేపట్టారు. ముందుగా గ్రంథాలయ పితామహుడు రంగనాథన్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టీఎన్ రసూల్, అధ్యాపకులు పి. కోటేశ్వరరావు, జానకీ రామ్, వి.రమేశ్‌బాబు, జి. గౌరీ శంకరరావు, గణేష్, దామోదరం, భాస్కరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

హుకుంపేటలో..

హుకుంపేట; గ్రంథాలయ వారోత్సవాలు ముగిసినట్టు స్థానిక గ్రంథాలయ అధికారి మానస తెలిపారు. బుధవారం ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలుగా బహుమతులు అందజేశారు.

గ్రంథాలయాలు విజ్ఞాన వేదికలు

డుంబ్రిగుడ: విజ్ఞానానికి గ్రంథాలయాలు వేదికగా నిలుస్తున్నాయని స్థానిక జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అప్పలనాయుడు అన్నారు. మండల కేంద్రంలో శాఖ గ్రంథాలయంలో లై బ్రేరియన్ సునీత ఆధ్వర్యంలో వారోత్సవాలు ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆటలు, పాటలు, వ్యాసరచన మ్యూజికల్ చైర్ పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈకార్యక్రమంలో అధ్యాపకులు, ప్రధానోపాధ్యాయులు కృష్ణారావు, సునీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పుష్పగుచ్ఛంతో అభినందిస్తున్న గిడ్డి ఈశ్వరి, చింతపల్లి టీడీపీ నాయకులు

ఆర్టీసీ రీజనల్ చైర్మన్ దొన్నుదొరకు సత్కారం

చింతపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ రీజనల్ చైర్మన్‌గా నియమితులైన దొన్నుదొరను టీడీపీ పాడేరు నియోజకవర్గం ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి, చింతపల్లి నాయకులు బుధవారం పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఈశ్వరి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంలో గిరిజన ప్రాంత నాయకులకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు చెప్పారు. నామినేటెడ్ పదవుల్లో అరకు, పాడేరు నియోజకవర్గాల నాయకులకు కేటాయించారన్నారు. తమ పార్టీలో ప్రతి కార్యకర్తకూ మంచి గుర్తింపు ఉంటుందనడానికి ఇదే నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొర్ర విజయరాణి, టీడీపీ మండలాధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు, అబ్బాయినాయుడు, కేశ్వరరావు, యష్వంత్, మహేంద్ర పాల్గొన్నారు.

చందాలతో వంతెనకు మరమ్మతులు


ఎక్స్‌కవేటర్‌తో మరమ్మతులు చేపడుతున్న దృశ్యం

కొయ్యూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వరద నీటి ప్రవాహ ఉధృతికి శిథిలమైన వంతెనను గ్రామస్తులు చందాలు పోగు చేసుకుని మరమ్మతులు చేపట్టి రాకపోకలను పునరుద్ధరించారు. మండలంలో గోకిరి పంచాయతీలో చేరిన పాడి గ్రామానికి సమీపంలో కొండవాగుపై నిర్మించిన వంతెన గత నెలలో కురిసిన భారీ వర్షాలకు కొట్టుకు పోయింది. దీంతో కనీసం ద్విచక్ర వాహనం కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఈ రహదారి ఆధా రంగా సాగించే సుమారు పది గ్రామాల వారు అదనంగా మరో ఆరు కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోంది. ప్రధానంగా పాడి గ్రామంలో మూత్ర పిండాలకు సం బంధించిన వ్యాధిన బారిన పడి నలుగురు రోగులున్నారు. వీరిని డయాలసిస్ కోసం ఆస్పత్రికి తరలించడం యజ్ఞంలా మారింది. ఈస్థితిలో వంతెన సమస్య అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా స్పందనకానరాకపోవడంతో గ్రామస్తులే పూనుకుకున్నారు.చందాలువేసుకుని ఎక్స్‌కవేటర్ సాయంతో వంతెనపై నుంచి వాహన రాకపోకలకు వీలుగా మరమ్మతులు చేపట్టారు.

సమస్యలు పరిష్కరించే వరకు నిరాహార దీక్షలు

- గురుకులాల అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల అధ్యక్షుడు కొండబాబు


రిలే దీక్షల్లో గిరిజన గురుకులాల అధ్యాపకులు, ఉపాధ్యాయులు

పాడేరురూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గిరిజన గురుకులాల్లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేంత వరకు నిరాహార దీక్షలు కొనసాగిస్తామని ఉద్యోగుల జిల్లా అధ్యక్షుడు ఎల్.కొండబాబు, కార్యదర్శి ఎన్.వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలల్లో అవుట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, లెక్చరర్లు తమను కాంట్రాక్టు రెసిడెన్షియ ల్ ఉద్యోగులుగా మార్చు చేయాలని కోరుతూ, ఐటీడీఏ ఎదురుగా చేపట్టిన నిరాహార దీక్షలు బుధవారానికి ఐదో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ గిరిజన గురుకులాల్లో 15 ఏళ్లగా పనిచేస్తున్నా జీతాలు, జీవితాల్లో మార్పులేదని వాపోయారు.

'వెలుగు వీవోఏల సమస్యలు పరిష్కరించాలి'


ర్యాలీ చేస్తున్న వీవోఏలు

పాడేరురూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): వెలుగు వీవోఏలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ వెలుగు వీవోఏ (యానిమేటర్స్) ఉద్యోగుల సంఘం జిల్లా నాయకుడు ఎల్‌బీ పోతురాజు డిమాండ్‌చేశారు. ఈ మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట వీవోఏలు ధర్నా చేపట్టారు. ముందుగా పాడేరులో భారీ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెలుగు వీవోఏలకు మూడేళ్ల కాలపరిమితి జీవోను గత వైసీపీ ప్రభుత్వం 2019లో తెచ్చిందన్నారు. దాంతో గత 15 ఏళ్లగా పనిచేస్తున్న వారి కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం వీవోఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, రూ. 10 లక్షలు గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. ఈమేరకు జేసీ అభిషేక్ గౌడ్‌కు వినతి పత్రం అందించారు. వీవోఏల సంఘం జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

బాలలతో పని చేయిస్తే చర్యలు



తనిఖీలు చేపడుతున్న కార్మిక శాఖ అధికారులు

పాడేరురూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): బాలలతో పనులు చేయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని కార్మిక శాఖ సహాయ కార్మికాధికారి పి.సూర్యనారాయణ హెచ్చరించారు. బుధవారం పాడేరులో విస్తృతంగా షాపు ల్లో తనిఖీలను చేపట్టారు. ఈ సందర్భంగా బాలకార్మికుడితో పనులు చేయిస్తున్న ఏజేఎం కిరాణాషాపు యజమానిపై కేసు నమోదు చేశారు. కార్మికులకు తక్కువ వేతనాలు చెల్లిస్తున్నట్లు గుర్తించి శాంతి న్యూలుక్ జీన్స్ కార్నర్, విజయ కట్‌పీస్ సెంటర్, శ్రీపలివాల్ హర్యానా జిలేబీ షాపు, జేకే ఫ్యాన్సీ స్టోర్ దుకాణదారులపై కేసులు నమోదు చేశామన్నారు. ఈ తనిఖీల్లో ఏఎస్‌ఐ సూరిబాబు, బాలల సంరక్షణ విభాగం నుంచి టి.ప్రమీల, కౌన్సిలర్ జ్ఞానేశ్వరి, సర్వశిక్ష అభియాన్ నుంచి జె.కూర్మారావు పాల్గొన్నారు.

తప్పుడు కుల ధృవపత్రాలపై విచారణ


విచారణ చేపడుతున్న ఆర్ మహదేవ్

సీలేరు, నవంబరు 20, (ఆంధ్రజ్యోతి): జీకే వీధి మండలం సీలేరు సచివాలయంలో ఆర్ఐ మహదేవ్ ఆధ్వర్యంలో తప్పుడు కుల ధృవీకరణ పత్రాలపై బుధవారం విచారణ నిర్వహించారు. సీలేరుకు చెందిన వేర్వేరు కులాలకు చెందిన నలుగురు ఎస్టీ, ఎస్సీ సర్టిఫికెట్లు పొంది వివిధ శాఖల్లో ఉద్యోగాలు చేస్తున్నట్టు కలెక్టర్‌కు ఫిర్యాదు అందిన మేరకు ఈ విచారణ చేపట్టారు. ఫిర్యాదులో పేర్కొన్న నలుగురినీ పది రోజుల్లో వారి కులాలకు సంబంధించి తండ్రి, తాతలకు సంబంధించిన పాత ధ్రువ పత్రాలుంటే తీసుకువచ్చి నిరూపించుకోవాలని ఆర్ఐ వారికి సూచించారు. కార్యక్రమంలో వీఆర్వో స్వరూప్, సర్పంచ్ దుర్గో, ఎంపీటీసీ పిల్లా సాంబమూర్తి, ఉప సర్పంచ్ వల్లీప్రసాద్, డీసీసీ కార్యదర్శి కారే శ్రీను, వార్డు సభ్యులు వానపల్లి అప్పారావు, కూటమి సభ్యులు కారే అప్పలరాజు పాల్గొన్నారు.

కోనాం సచివాలయంలో ఉద్యోగుల కొరత

కోనాం సచివాలయాన్ని ఉద్యోగుల కొరత వేధిస్తోంది. మొత్తం 11 మంది గ్రామ సహాయకుల్లో ప్రధానమైన మూడు పోస్టులు ఖాళీగా ఉండగా, మరొకరు డిప్యుటేషన్‌పై వేరే ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్నారు. మహిళా సంరక్షణ సహాయకులు మెటర్నటీ లీవులో ఉన్నారు. మిగిలిన సచివాలయ అసిస్టెంట్లలో ఎక్కువ మంది క్షేత్ర స్థాయి విధులకు వెళ్తుండడంతో సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి ఒక్కరే ఉండాల్సి వస్తోంది. దీంతో వివిధ పనులపై వస్తున్న ప్రజలు సంబంధిత సహాయకులు అందుబాటులో లేక తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

- మూడు ముఖ్య సహాయకుల పోస్టులు ఖాళీ
- డిప్యుటేషన్‌పై పక్క మండలానికి మత్స్య శాఖ అసిస్టెంట్
- మెటర్నటీ లీవ్‌లో మహిళా సంరక్షణ సహాయకురాలు
- 18 గ్రామాల ప్రజల ఇబ్బందులు.. పట్టించుకోని అధికారులు




సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న ఒకే ఒక పంచాయతీ కార్యదర్శి

చీడికాడ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనాం గ్రామ సచివాలయం పరిధిలో కోనాం, మంచాల పంచాయతీలకు చెందిన 18 గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాల్లో దాదాపు 4743 మంది ప్రజలు జీవనం సాగిస్తున్నారు. సాధారణంగా 2,500 నుంచి మూడు వేల మందికి ఒక సచివాలయం ఉండాల్సి ఉంది. ఈ పరిమితికి మించి ఇక్కడ జనాబా ఉండడంతో రెండు సచివాలయాలు అవసరం కాగా, ఉన్న ఒక్క సచివాలయంలోనూ ఉద్యోగుల కొరతతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

ఈ సచివాలయంలోని 11 మంది గ్రామ సహాయకులకుగాను ఇంజనీరింగ్, వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మత్స్య శాఖ అసిస్టెంట్ డిప్యుటేషన్‌పై ఎలమంచిలిలో పనిచేస్తున్నారు. ఇక మహిళా సంరక్షణ సహాయకులు ప్రసూతి సెలవులో ఉన్నారు. దీంతో పంచాయతీ కార్యదర్శి, వీఆర్‌వో, సర్వేయర్, హార్టికల్చర్, ఏఎన్ఎం, ఎనర్జీ అసిస్టెంట్ పోస్టులు ఉన్నప్పటికీ, వీరిలో ఎక్కువ మంది క్షేత్ర స్థాయిలోనే విధులు నిర్వహించాల్సిన పరిస్థితి. దీంతో వివిధ పనులపై సచివాలయానికి వెళ్తున్న ప్రజలకు గ్రామ సహాయకులు అందుబాటులో ఉండడం లేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్ల పోస్టుల ఖాళీ కావడం, ఎక్కువగా వారితోనే ప్రజలకు పనులు ఉండడంతో రోజూ అవస్థలు తప్పడం లేదు. ఫలితంగా 18 గ్రామాల నుంచి ఉదయం వేళలో సచివాలయానికి వస్తున్న ప్రజలకు పంచాయతీ కార్యదర్శి మాత్రమే అందుబాటులో ఉంటుందన్నారు. వారందరికీ ఆయన సేవలు అందించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సచివాలయంలో అందరూ గ్రామ సహాయకులు ఉండేలా తగిన చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో హేమసుంద్రరావును వివరణ కోరగా, సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకు వెళ్లామని చెప్పారు. త్వరలో అందరు గ్రామ సహాయకులు అందుబాటులో ఉండేలా చూస్తామని ఆయన తెలిపారు.



వెంకన్నపాలెంలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు... (ఇన్‌సెట్‌లో) రామన్నపాలెంలో పూర్తయిన సిమెంట్ డ్రైన్

అభివృద్ధి బాట

- మాకవరపాలెం మండలంలో 68 సీసీ రోడ్ల నిర్మాణం
- 20 రహదారులు పూర్తి.. శరవేగంగా మిగిలిన రోడ్లు

మాకవరపాలెం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామీణ రహదారులు అభివృద్ధి చెందుతున్నాయి. ఏడాది క్రితం వరకు అధ్వానంగా, ప్రమాదకరంగా ఉన్న మార్గాలు ఇప్పుడిప్పుడే రూపురేఖలు మారుతున్నాయి. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పల్లె పండగ కార్యక్రమం అనంతరం పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిధుల వరద పారించడంతో రహదారులు, డ్రైనేజీలకు మోక్షం లభించింది. పల్లె రోడ్లకు 75 శాతం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, మిగిలిన 25 శాతం పంచాయతీ నిధులతో రహదారుల అభివృద్ధి పనులు చేపడుతున్నారు. మండలానికి 25 శాతం నిధుల కింద సుమారు 2.2 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నిధుల్లో ఎక్కువగా సీసీ రోడ్లు, సీసీ డ్రైన్లు పనులను చేపడుతున్నారు.

మండల వ్యాప్తంగా 68 రహదారుల నిర్మాణాలను ప్రారంభించగా, ఇప్పటికే 20 రోడ్లు పూర్తయ్యాయి. మిగిలిన రోడ్ల నిర్మాణ పనులు కూడా శరవేగంగా సాగుతున్నాయి. మండలంలోని శెట్టిపాలెం, వెంకన్నపాలెం, భీమబోయిన పాలెం, నారాయణరాజుపేట, కొత్తపాలెం గ్రామాలతో పాటు 20 రోడ్లు పూర్తయ్యాయి. అలాగే రామన్నపాలెం, కొత్తపాలెం, భీమబోయినపాలెంలో సీసీ డ్రైన్లు పూర్తయ్యాయి. మిగిలిన గ్రామాల్లో పనులను సంక్రాంతిలోగా పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఆ దిశగా అధికారులు చర్యలు చేపడుతున్నారు. రహదారులన్నీ పూర్తయితే సంక్రాంతికి పల్లెలకు నూతన శోభ రానున్నది. దీంతో మండల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చురుగ్గా టీడీపీ సభ్యత్వ నమోదు


సాలికమల్లవరంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం

గొలుగొండ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని పంచాయతీల్లో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చురుగ్గా జరుగుతోంది. సాలికమల్లవరం, జోగంపేట, గొలుగొండ, పప్పుశెట్టిపాలెం గ్రామాల్లో బుధవారం సభ్యత్వ నమోదు చేపట్టారు. మండలంలోని ఇప్పటివరకు ఆరు వేలకు పైగా సభ్యత్వాలు నమోదయ్యాయి. డిసెంబరు నెలాఖరువరకూ ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు టీడీపీ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పెదిరెడ్ల మల్లేశ్వరరావు, కోల్లాన కొండలరావు, బెల్లపు కొండలరావు పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో చోద్యం విద్యార్థుల ప్రతిభ


పోటీల్లో గెలుపొందిన విద్యార్థులతో హెచ్‌ఎం శ్రీనివాసరావు, తదితరులు

కృష్ణాదేవిపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): చోద్యం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు క్విజ్, ముగ్గుల పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ పోటీల్లో ఆరుగురు విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. తల్లిదండ్రుల కమిటీ అధ్యక్షుడు సత్తిబాబు, హెచ్‌ఎం శ్రీనివాసరావు, వ్యాయామ ఉపాధ్యాయుడు కుందూరు నూకరాజు, ఉపాధ్యాయులు రమణ, వాసు, ప్రసాద్ తదితరులు విద్యార్థులను అభినందించారు.

బాధితురాలికి స్నేహితుల ఆర్థిక సాయం


బాధితురాలికి ఆర్థిక సాయం అందిస్తున్న స్నేహితులు

బుచ్చెయ్యపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): భర్తను కోల్పోయి ఇద్దరు పిల్లలతో తల్లిదండ్రుల చెంత చేరిన ఓ బాధితురాలు రోడ్డు ప్రమాదంలో ఇటీవల గాయపడి మంచానపడిన విషయం తెలుసుకున్న స్నేహితులు బుధవారం పరామర్శించారు. ఆమెకు అండగా నిలబడి ఆర్థిక సాయం అందించారు. కుమందానిపేటకు చెందిన పొలమరశెట్టి సత్యబాల భర్త రెండేళ్ల క్రితం చనిపోయారు. ఆమెకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సత్యబాల ఈ నెల 2న బీఎన్ రోడ్డులోని లక్ష్మీపురం కళ్లాల వద్ద రోడ్డు ప్రమాదంలో గాయపడింది. ఈ విషయం తెలుసుకున్న సత్యబాల 2003 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు రూ.60 వేలు నగదు సేకరించి బుధవారం అంద చేశారు. స్నేహితుల ఔదార్యాన్ని స్థానిక ప్రజలు ప్రశంసించారు.

దేవరాపల్లి-వాలాబు రోడ్డు నిర్మించాలని నిరసన


రోడ్డు నిర్మించాలని నిరసన తెలుపుతున్న గిరిజనులు

దేవరాపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): దేవరాపల్లి నుంచి వాలాబు వెళ్లే రహదారిని నిర్మించాలని సీపీఎం మండల కార్యదర్శి బి.టి.దొర డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం గిరిజనులతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్య, వైద్యం, నిత్యావసర వస్తువుల కోసం వాలాబు నుంచి దేవరాపల్లి రావాలని, రోడ్డు పాడవడంతో ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. సరియా జలపాతానికి రావాలన్నా ఇదే మార్గం కావడంతో పర్యాటకులు నరకం చూస్తున్నారన్నారు. నాయకులు పి.అప్పలరాజు, నారాయణ, సింహాచలం, గిరిజనులు పాల్గొన్నారు.

నీటి తీరువా చెల్లింపులకు పోటీదారుల అగచాట్లు


నీటి పన్నులు చెల్లించేందుకు వచ్చిన రైతులు

గొలుగొండ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ ద్వారా నీటి తీరువా చెల్లించేందుకు సాగునీటి సంఘాల పోటీదారుల అగచాట్లు పడుతున్నారు. మండలంలోని 13 సాగునీటి సంఘాలకు ఈ నెల 23వ తేదీన ఎన్నికలు నిర్వహించేందుకు ఇరిగేషన్ శాఖ చర్యలు చేపట్టింది. అయితే పోటీదారులు తప్పనిసరిగా ఆన్‌లైన్ ద్వారా నీటి తీరువా చెల్లిస్తేనే ఎన్నికల్లో పోటీకి అర్హులని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో తహసీల్దార్ కార్యాలయానికి పలు గ్రామాల నుంచి పోటీదారులు డిమాండ్ నోటీసులు పొందేందుకుగాను తరలి వచ్చారు. అయితే రీ సర్వే గ్రామాలకు వెబ్‌ల్యాండ్ పనిచేయకపోవడంతో డిమాండ్ నోటీసులు పోటీదారులకు అందించే పరిస్థితులు లేవు. ఫలితంగా ఎన్నికల సమయం దగ్గరపడుతుండడంతో పోటీదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను ఉన్నతాధికారులు సమస్య పరిష్కరించాలని పోటీదారులు కోరుతున్నారు. దీనిపై తహసీల్దార్ శ్రీనివాసరావును సంప్రదించగా రీ సర్వే గ్రామాల్లో మినహా అన్ని గ్రామాల్లోనూ నీటితీరులా చెల్లించేందుకు డిమాండ్ నోటీసులు అందిస్తున్నామని చెప్పారు. అలాగే ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన వివరించారు.

మండల సర్వసభ్య సమావేశం వాయిదా

నాతవరం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. బుధవారం జరగాల్సిన ఈ సమావేశానికి ఉదయం 10 గంటలకు పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు వచ్చి కూర్చొన్నారు. అయితే ఎక్కువ మంది వైసీపీకి చెందిన ఎంపీటీసీ సభ్యులు రాకపోవడంతో కోరం సరిపడలేదు. దీంతో సమావేశాన్ని వాయిదా వేశారు. సమావేశానికి వచ్చిన అధికారులు, టీడీపీకి చెందిన ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు మధ్యాహ్నం వరకు వేచిచూసి వెనుదిరిగారు.

తాగునీటి బోరు పనులు ప్రారంభం

నర్సీపట్నం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఏరియా ఆస్పత్రిలోని ఆయుష్ ఆస్పత్రి వద్ద 26వ వార్డు కౌన్సిలర్ చింతకాయల పద్మావతి బుధవారం తాగునీటి బోరు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మిగిలిన పనులకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు రూ.9 లక్షలు మంజూరు చేసినట్టు తెలిపారు. 2017లో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో పనులు చాలా వరకు పూర్తి చేయడం జరిగిందని, వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టించుకోలేదని ఆమె ఆరోపించారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

చోడవరం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాలు బుధవారంతో ముగిశాయి. వారోత్సవాల ముగింపు సందర్భంగా చోడవరం శాఖా గ్రంథాలయంలో వారం రోజుల పాటు నిర్వహించిన వివిధ పోటీలలో పాల్గొన్న విద్యార్థులలో విజేతలకు కె.కాలనీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు గొల్లు శ్రీనివాసరావు చేతుల మీదుగా బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి జి.తిరుమలకుమారి పాల్గొన్నారు. అలాగే చోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్ చేతుల మీదుగా బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి మాల్యాద్రి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్‌పై ఎమ్మెల్యే ఫిర్యాదు

కె.కోటపాడు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానికుల నుంచి అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న కె.కోటపాడు సబ్ రిజిస్ట్రార్ సత్యనారాయణపై మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఫిర్యాదు చేశారు. రిజిస్ట్రార్‌పై చర్యలు తీసుకోవాలని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ డీఐజీకి లిఖితపూర్వకంగా ఫిర్యాదు అందజేశారు.

చెట్టుపల్లిలో సారా బట్టీ ధ్వంసం

నర్సీపట్నం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో చెట్టుపల్లి శివారు ప్రాంతంలోని జీడి తోటల్లో రూరల్ పోలీసులు బుధవారం సారా బట్టీ ధ్వంసం చేశారు. ముందస్తు సమాచారంతో సీఐ రేవతమ్మ ఆధ్వర్యంలో ఎస్ఐ రాజారావు, సిబ్బంది వెళ్లి నాలుగు వేల లీటర్ల బెల్లం పులుసును ధ్వంసం చేశారు.

కుముదానిపేటలో 1050 లీటర్లు...

రావికమతం: పి.పొన్నవోలు పంచాయతీ శివారు కుముదానిపేటలో నాటుసారా తయారీ స్థావరాలపై కొత్తకోట పోలీసులు దాడులు చేశారు. ఇక్కడ నాటుసారా తయారీ జోరుగా ఉందన్న సమాచారం మేరకు ఎస్ఐ ఎం.శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం 1050 లీటర్ల బెల్లపు పులుసును ధ్వంసం చేశారు. తయారీదారులు పరారీ అయ్యారని ఎస్ఐ తెలిపారు.

గింజ దశలో పంటను కాపాడుకోండి

కె.కోటపాడు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గింజ దశలో వరి పంటను కాపాడుకోవాలని మండల వ్యవసాయాధికారి సోమశేఖర్ సూచించారు. సింగన్నదొరపాలెంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ఆర్‌జీఎల్ వరి రకం గింజ గట్టిపడిన దశలో రెల్లురాల్చు పురుగు ఉధృతంగా ఉందన్నారు. రబీ కాలానికి వేరుశనగ, పెసర, మినుము విత్తనాలు రైతు సేవ కేంద్రాల్లో పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల విద్యార్థుల హిస్టారికల్ టూర్



విశాఖలోని వీఎస్ కృష్ణ గ్రంథాలయం దగ్గర డిగ్రీ కళాశాల విద్యార్థులు

నర్సీపట్నం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు విశాఖపట్నం ఆంధ్రా యూనివర్సిటీలోని డాక్టర్ వీఆర్ కృష్ణా గ్రంథాలయాన్ని సందర్శించారు. 57వ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజు విద్యార్థులను బుధవారం హిస్టారిక్ టూర్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వీఆర్ కృష్ణా గ్రంథాలయంలో భారత రాజ్యాంగం ఒరిజనల్ కాపీ, తాళపత్ర గ్రంథాలు, శ్రీరామానుజన్ స్వహస్తాలతో రాసిన పుస్తకాలు, భారతీయ సంస్కృతిని ప్రతిబింబించే పుస్తకాలు విద్యార్థులు ఆసక్తిగా పరిశీలించారు. విశాఖ మ్యూజియంలో హెరిటేజ్ మ్యూజియం, నావెల్ మ్యూజియాన్ని కూడా సందర్శించారు.

గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలు...

రావికమతం: గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలని మండల విద్యా శాఖాధికారి తలుపులు అన్నారు. గంథ్రాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా రావికమతం, కొత్తకోటలో బుధవారం గ్రంథ పాలకురాలు ఆర్.వరహామణి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. విద్యార్థులు జ్ఞాపకశక్తిని పెంచుకోవడానికి గ్రంథాలయాల్లో విలువైన పుస్తకాలు ఉన్నాయన్నారు. వీటి ద్వారా ఎలాంటి పోటీ పరీక్షలకైనా సన్నద్ధం కావచ్చని చెప్పారు. పలువురు వక్తలు మాట్లాడుతూ గ్రంథాలయాల ఆశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో కొత్తకోట కళాశాల ప్రిన్సిపాల్ సత్యవతి, హెచ్‌ఎం. నాగేశ్వరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కె.కోటపాడు: గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా వివిధ పోటీల విజేతలకు స్థానిక పాఠశాల హెచ్‌ఎం పద్మావతి బహుమతులను అందజేశారు. శాఖా గ్రంథాలయాధికారి కె.సౌమ్య ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోలుగుంట: గ్రంథాలయ వారోత్సవాల్లో నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బుధవారం బహుమతులను అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు ప్రసాద్, వెంకటరావు, గ్రంథాలయాధికారి వరలక్ష్మి పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ నిజాయితీ

బట్టల బ్యాగులను తిరిగి ఇచ్చిన వైనం



బాధితులకు బ్యాగులు అందిస్తున్న డ్రైవర్ నాయుడు

చీడికాడ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): బట్టల బ్యాగులు పోగొట్టుకున్న బాధితులకు తిరిగి అందించి ఓ ఆటో డ్రైవర్ నిజాయితీ చాటుకున్నాడు. చీడికాడ గ్రామానికి చెందిన బుధవారం ఉదయం వెళ్లి ఈ బ్యాగులు అందించారు. మండలంలోని మంచాల శివారు ఎం.గదబూరు గ్రామానికి చెందిన ఎంగిలి నరసమ్మ కుమారుడు వివాహం నిమిత్తం కుటుంబ సభ్యులకు మంగళవారం అనకాపల్లి బట్టలు కొనుగోలుకు వెళ్లారు. సాయంత్రం తిరిగి ఆటోలో స్వగ్రామం వెళుతుండగా దామునాపల్లి నుంచి వరహాపురం మధ్య రోడ్డు గతుకులమయంగా ఉండటంతో బట్టల బ్యాగులు కిందకి పడిపోయాయి. వెనుకన 15 నిమిషాల తరువాత చీడికాడ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ వేచలపు నాయుడు వస్తుండగా బట్టల బ్యాగులను తీసి ఆటోలో పెట్టాడు. బట్టల లోపల ఉన్న బిల్లులో ఫోన్ నంబర్ పరిశీలించి సమాచారం ఇచ్చాడు. గదబూరు గ్రామానికి చెందిన వారిగా నిర్ధారించుకుని బుధవారం ఉదయం వెళ్లి కుటుంబానికి అందించారు. దీంతో గిరిజన పెద్దలు అతన్ని అభినందించారు.

మెగా కంటి వైద్య శిబిరానికి స్పందన


రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

రోలుగుంట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పీఏసీఎస్ వద్ద జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి పరిసర ప్రాంతాలకు చెందిన 90 మంది కంటి రోగులు హాజరయ్యారు. వీరికి పరీక్షలు చేయగా 39 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించి శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో శంకర్ ఫైండేషన్ వైద్యులు సురేశ్ క్యాంపు మేనేజర్ అరుణ్‌కుమార్, నిర్వాహకులు పాల్గొన్నారు.

అల్లూరి పార్కులో నిలిచిన విద్యుత్ సరఫరా

కృష్ణాదేవిపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండల కృష్ణాదేవిపేట అల్లూరి సమాధులు ఉన్న పార్కులో విద్యుత్ సౌకర్యం లేదు. దీంతో పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు. సమీపంలోని బొడ్డేరు వంతెన వద్ద భారీ వృక్షాన్ని గుర్తుతెలియని వ్యక్తులు నరకడంతో వైర్లపై పడటంతో రెండు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో సరఫరా నిలిచిపోయింది. ఫలితంగా పర్యాటకులతో పాటు రాత్రి వేళల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది కూడా ఇబ్బంది పడుతున్నారు.

సంఘటితమై స్వయం ఉపాధికి బాటలు

ప్రభుత్వ రుణాలను సద్వినియోగం చేసుకున్న డ్వాక్రా సంఘాలు

కశింకోట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం డ్వాక్రా సంఘాలకు అందిస్తున్న రుణాలతో సభ్యులు ఆర్థిక పురోగతి సాధిస్తున్నారు. కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని నిలదొక్కుకుంటున్నారు. పేపరు ప్లేట్ల తయారీ యూనిట్లు, అంబ్రాయిడింగ్, కుట్టు మెషీన్లు, తదితర యూనిట్లు ఏర్పాటు చేసుకుని స్వశక్తితో ఎదుగుతున్నారు.

- బయ్యవరంలో కుటీర పరిశ్రమలు ఏర్పాటు
- పేపరు ప్లేట్ల తయారీ, అంబ్రాయిడింగ్, కుట్టు మెషీన్లు, తదితర యూనిట్లు నెలకొల్పి పలువురికి ఉపాధి
- ఆన్‌లైన్‌లో కూడా విక్రయాలు



బయ్యవరంలో పేపర్ ప్లేట్లు తయారు చేస్తున్న డ్వాక్రా సంఘం మహిళలు

మండలంలోని బయ్యవరం గ్రామంలో 83 డ్వాక్రా సంఘాలున్నాయి. ఒక్కో సంఘంలో మొత్తం 10 మంది సభ్యులు ఉన్నారు. వీరికి ప్రభుత్వం రుణాలు మంజూరు చేయడంతో మూడేళ్ల క్రితం టైలరింగ్, అంబ్రాయిడింగ్, పేపరు ప్లేట్ల తయారీ యూనిట్లను ఏర్పాటు చేసుకున్నారు. ఇందులో పడమటాంబిక గ్రూపు, శ్రీసాయి గ్రూపు, శివపార్వతి గ్రూపులకు చెందిన ముగ్గురు మహిళలు పేపరు ప్లేట్ల తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేశారు. నర్సీపట్నం వద్ద ఉన్న కొత్తకోట నుంచి అట్టలను దిగుమతి చేసుకొని అద్దె గదిలో ప్లేట్లను తయారు చేస్తున్నారు. ఎనిమిది మంది సభ్యులు ఈ పనులకు సహకరిస్తున్నారు. తయారు చేసిన పేపరు ప్లేట్లను అనకాపల్లి, నర్సీపట్నం తదితర ప్రాంతాలకు తరలించి విక్రయిస్తున్నారు. ప్రస్తుతం ఆన్‌లైన్ విక్రయాలు కూడా ప్రారంభించారు. పెళ్లిళ్ల సీజన్‌లో బిజినెస్ బాగుంటుందని, ప్రభుత్వం సబ్సిడీపై మెషీన్లు, ముడి సరకు సరఫరా చేస్తే మరింత మందికి ఉపాధి కల్పించే అవకాశం ఉంటుందని వీరు తెలిపారు.

ప్రభుత్వం ప్రోత్సహిస్తే మరింత మందికి ఉపాధి



ముగ్గురు సభ్యులకు రూ.3 లక్షలు డ్వాక్రా సంఘం నుంచి రుణం వచ్చింది. వాటిని పెట్టుబడిగా పెట్టి పేపరు ప్లేట్ల తయారీ యూనిట్ ఏర్పాటు చేసి పలువురికి ఉపాధి కల్పిస్తున్నాం. రోజుకు 300 వరకు పేపర్ ప్లేట్లు తయారు చేస్తున్నాం. వాటిని మార్కెట్లో విక్రయిస్తున్నాం. ప్రభుత్వం ప్రోత్సహిస్తే ఉత్పత్తి పెంచి మరింత మందికి ఉపాధి కల్పిస్తాం.

- సుభాషిని, శ్రీసాయి గ్రూపు సభ్యురాలు, బయ్యవరం

విద్యుత్ చార్జీల్లో రాయితీ ఇవ్వాలి



విద్యుత్ చార్జీలకే నెలకు రూ.4 వేలు ఖర్చు అవుతోంది. విద్యుత్ చార్జీలు తగ్గిస్తే మాకు కొంత వరకు వెసులుబాటు ఉంటుంది. ప్రభుత్వం మాకు సహాయం అందించాలి.

- కాశిన భవాని, పడమటాంబిక గ్రూపు సభ్యురాలు, బయ్యవరం

సభ్యులు ఆర్థికంగా ఎదుగుతున్నారు



డ్వాక్రా గ్రూపులో సభ్యులకు ప్రభుత్వం ఇచ్చే రుణాలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయి. బయ్యవరం గ్రామంలో మొత్తం 83 డ్వాక్రా సంఘాలు ఉన్నాయి. వారికి ప్రభుత్వం ఇచ్చే రుణాలతో అంబ్రాయిడింగ్, టైలరింగ్, పేపరు ప్లేట్ల తయారీ యూనిట్లు ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందుతున్నారు. దీని వల్ల వీరు ఆర్థికంగా ఎదుగుతున్నారు.

- సత్య, వీఏవో, బయ్యవరం

108 అంబులెన్స్‌లో ప్రసవం



108 అంబులెన్స్‌లో ప్రసవించిన నీలవేణి, శిశువును పట్టుకున్న సిబ్బంది

మాడుగుల రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నెలల నిండిన గర్భిణిని ఆస్పత్రికి తరలిస్తుండగా 108 అంబులెన్స్‌లో పురుటి నొప్పులు వచ్చాయి. దీంతో సిబ్బంది వాహనాన్ని నిలుపుదల చేసి కాన్పు చేశారు. సుఖ ప్రసవం కావడం, తల్లీశిశువు క్షేమంగా వుండడంతో కుటుంబ సభ్యులు ఊపిరిపీల్చుకున్నారు. వివరాల్లోకి వెళితే.. రావికమతం మండలం గొంప గ్రామానికి చెందిన పిల్లా నీలవేణి నిండు గర్భిణి. బుధవారం తెల్లవారుజామున పురుటినొప్పులు ప్రారంభమయ్యాయి. దీంతో కుటుంబ సభ్యులు 108కు ఫోన్ చేశారు. కొద్దిసేపట్లో 108 అంబులెన్స్ వాహనం గొంప గ్రామానికి వెళ్లింది. గర్భిణిని అంబులెన్స్‌లో ఎక్కించి అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి బయలుదేరారు. అయితే సుమారు ఏడు కిలోమీటర్ల దూరం వెళ్లేసరికి నీలవేణికి పురుటినొప్పులు అధికమయ్యాయి. సమీపంలోని తురకలపూడి పీహెచ్‌సీ వద్దకు అంబులెన్స్‌ను తీసుకువచ్చి ఆపారు. స్టాఫ్ నర్స్ వచ్చి గర్భిణిని పరిశీలించింది. తొలికాన్పు కావడంతో పరిస్థితి ఇబ్బందికరంగా వుందని, ఎన్టీఆర్ ఆస్పత్రికి తీసుకెళ్లాలని చెప్పింది. దీంతో అంబులెన్స్ అనకాపల్లి బయలుదేరింది. సుమారు అర కిలోమీటరు దూరం వెళ్లే సరికి నొప్పులు మరింత తీవ్రం కావడంతో అంబులెన్స్‌ను రోడ్డు పక్కన నిలుపుదల చేసి, కాన్పు చేశారు. నీలవేణికి సుఖప్రసవం జరిగి మగ బిడ్డకు జన్మనిచ్చింది. తరువాత 108 సిబ్బంది అంబులెన్స్‌ను తిరిగి తురకలపూడి పీహెచ్‌సీకి తీసుకువచ్చి తల్లీశిశువులను ఆస్పత్రిలో చేర్పించారు. ఇద్దరూ క్షేమంగానే ఉన్నారని 108 అంబులెన్స్ పైలట్ శ్రీనివాసరావు, ఈఎంటీ హేమసుందర్ చెప్పారు.

గోవాడ షుగర్స్‌లో చెరకు రస నాణ్యత పరీక్షలు



చెరకు రస నాణ్యత పరీక్షలు ప్రారంభించిన ఎండీ సన్యాసినాయుడు

చోడవరం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గోవాడ షుగర్ ఫ్యాక్టరీలో చెరకు రసనాణ్యత పరీక్షలను బుధవారం ఎండీ వి.సన్యాసినాయుడు ప్రారంభించారు. రసనాణ్యత పరీక్షలు నిర్వహించడం ద్వారా క్రషింగ్ సీజన్ ప్రారంభానికి శ్రీకారం చుట్టారు. అనంతరం సెంట్రీ ఫ్యూగల్ యంత్రాలను కూడా ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు,, కార్మిక సంఘం నాయకులు కేవీవీఎస్ భాస్కరరావు, శరగడం రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తుల గడువు పొడిగింపు

అనకాపల్లి కలెక్టరేట్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ గడువు ఈ నెల 25వ తేదీ వరకు పొడిగించినట్టు మెగా డీఎస్సీ ఉచిత శిక్షణ కేంద్రం డైరెక్టర్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారిత అధికారిణి రాజేశ్వరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీఎస్సీ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ద్వారా ఉచిత శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. అనకాపల్లి జిల్లాకు చెంది అర్హులైన వెనుకబడిన తరగతులు అయిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ కులాలకు చెందిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు తెలిపారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను రఘురామకాలనీ, సర్వేపల్లి రాధాకృష్ణన్ జూనియర్ కాలేజి వీధి, అనకాపల్లి జిల్లాలో గల కార్యాలయానికి నేరుగా దరఖాస్తు ను ఈ నెల 25వ తేదీలోగా అందజేయాలన్నారు.

2 నుంచి నృసింహ దీక్షలు

సింహాచలం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సింహాచలం వరాహలక్ష్మీ నృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఏటా నిర్వహించే నృసింహదీక్షలను డిసెంబరు రెండున ప్రారంభించనున్నట్టు ఈవో వేంద్ర త్రినాథరావు ప్రకటించారు. అదేవిధంగా డిసెంబరు 12 నుంచి ద్వాత్రింశతి (32 రోజుల) దీక్షలు ప్రారంభమవుతాయన్నారు. జనవరి 12, 2025న దీక్షల విరమణకు ఆలయ వైదిక కమిటీ ముహూర్తం నిర్ణయించిందని వివరించారు. దీక్షలు స్వీకరించే భక్తులకు మూలవిరాట్ వద్ద పూజలు చేసిన తులసిమాలలు, స్వామివారి ప్రతిమలను ఉచితంగా ఇస్తామన్నారు. ప్రతి రోజు నిత్యాన్న ప్రసాదం కింద మధ్యాహ్న భోజనం అందిస్తామని, భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.



సెజ్ ముఖద్వారం వద్ద రోడ్డు మరమ్మతులు పనులు

చురుగ్గా రోడ్డు మరమ్మతు పనులు

అచ్యుతాపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సెజ్ రోడ్డు మరమ్మతు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పూడిమడక వద్ద ఈ నెల 29న ఎన్టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ హబ్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శంకుస్థాపన చేయనున్నారు. ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులతో పాటు ఉన్నతాధికారులు అచ్యుతాపురం జంక్షన్ నుంచి ఈ మార్గం గుండానే వెళ్లాలి. దీంతో ఏపీఐఐసీ రోడ్డు మరమ్మతు పనులు శరవేగంగా చేస్తున్నారు. సెజ్ ముఖద్వారం (దుప్పితూరు జంక్షన్), మైలురాయి వంతెన వద్ద ఎక్సకవేటర్, రోడ్డు రోలర్, రెడీ మిక్స్ వంటి యంత్రాల సహాయంతో రోడ్డు మరమ్మతు పనులను బుధవారం ముమ్మరంగా చేశారు.

గండి బాబ్జీ, పీవీజీ కుమార్‌లకు సత్కారం



టీడీపీ నేతలను సత్కరిస్తున్న వెలమ సంఘం నాయకులు

విశాఖపట్నం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఏపీ కో-ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గోవర్స్ ఫెడరేషన్ లిమిటెడ్ చైర్మన్‌గా నియమితులైన గండి బాబ్జి, వెలమ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్‌గా నియమితులైన పీవీజీ కుమార్‌లను ఉత్తరాంధ్ర బీసీ సంఘం నాయకులు బుధవారం ఘనంగా సత్కరించారు. మెట్రో పాలిటిన్ విశ్రాంత మేజిస్ట్రేట్ పైలా సన్నిబాబు, నేషనల్ పోర్టు ట్రస్ట్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు గొర్లె చందు, వైజాగ్ పటం క్లబ్, వాకర్స్ క్లబ్ సభ్యులు వారికి గజమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు గొంప సత్యనారాయణ, వాసు, చిట్టిబాబు, సీనియర్ నాయకులు పంకజ్, బాపినాయుడు, విజయ్, కొండలరావు, మహేష్, ఈశ్వరరావు, గంటా అప్పలనాయుడు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	95.00
లైవ్ ధర	115.00
విత్ స్కిన్	200.00
స్కిన్ లెస్	210.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

పీఏసీఎస్‌ల కంప్యూటరీకరణ పూర్తి చేయాలి

» కలెక్టర్ విజయకృష్ణన్



మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్, హాజరైన అధికారులు

అనకాపల్లి కలెక్టరేట్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) కంప్యూటీకరణ పనులను వెంటనే పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశమందిరంలో కో-ఆపరేటివ్, డీసీసీబీ ఆప్కాబ్ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించి కంప్యూటీకరణ పనుల పురోగతిని సమీక్షించారు. కంప్యూటీకరణ పనులు పూర్తి చేయకపోవడం, రాష్ట్రస్థాయి సూచీల్లో వెనుకబడడంతో సంబంధిత అధికారులపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. కంప్యూటీకరణ పనుల్లో నిర్లక్ష్యం వహించే అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సహకార సంఘాల సభ్యుల పూర్తి వివరాలు సేకరించి కంప్యూటీకరణ చేయాలన్నారు. డేటా సేకరణ, అప్‌లోడ్ పనులను శుక్రవారం నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా కో-ఆపరేటివ్ అధికారిణి ప్రేమ స్వరూపరాణి, జిల్లా కో-ఆపరేటివ్ అకౌంట్స్ అధికారి గోవిందరావు, డీసీసీబీ సీఈవో వర్మ, ఆప్కాబ్ డీపీడీఎం రాజు, తదితరులు పాల్గొన్నారు.

సివిల్స్‌కు సిద్ధమయ్యే అభ్యర్థులకు ఉచిత శిక్షణ

అనకాపల్లి కలెక్టరేట్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : యూపీపీఎస్సీ నిర్వహించే సివిల్స్ పరీక్షల్లో ప్రిలిమ్స్, మెయిన్ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందించేందుకు బీసీ, ఎస్సీ, ఎస్టీ, నిరుద్యోగ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు జిల్లా బీసీ సంక్షేమ, సాధికారిత అధికారిణి రాజేశ్వరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు ఈ నెల 24వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఏదైనా డిగ్రీ పూర్తి చేసి ఉండాలన్నారు. రెండు ఫొటోలు, విద్య, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, పాన్‌కార్డు జతపరిచి ఈ నెల 24వ తేదీలోగా దరఖాస్తులను రఘురామకాలనీ, సర్వేపల్లి రాధాకృష్ణన్ జూనియర్ కాలేజి వీధి, అనకాపల్లి జిల్లాలో గల కార్యాలయానికి నేరుగా సమర్పించాలన్నారు. ఈ నెల 27వ తేదీన అభ్యర్థులకు ఎంపిక పరీక్ష ఉంటుందన్నారు.

విశాఖ డెయిరీపై సభాసంఘం

విశాఖపట్నం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): విశాఖ డెయిరీపై సభా సంఘం వేయాలని శాసనసభ నిర్ణయించింది. సభ్యుల నుంచి అభిప్రాయాలు తీసుకున్నాక స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఈ నిర్ణయం తీసుకున్నారు. ముందుగా విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ విశాఖ డెయిరీ నిధులు దుర్వినియోగం అవుతున్నాయని, డెయిరీని రైతులకు కాకుండా చేసి ఓ కుటుంబం సొంత ఆస్తిలా ఉపయోగించుకుంటున్నదని ఆరోపించారు. గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ, డెయిరీలో చాలా అక్రమాలు ఉన్నాయని, వాటిని తొక్కి పెడుతున్నారన్నారు. అన్ని డెయిరీలు పాల సేకరణ ధర పెంచుతుంటే విశాఖ డెయిరీ తగ్గించి రైతులకు నష్టం కలిగిస్తోందన్నారు. సొసైటీ కింద ఏర్పాటైన డెయిరీని కంపెనీగా మార్చేసి కొందరు తమ చేతుల్లో ఉంచుకున్నారని, రైతుల పేరుతో నిధులు దుర్వినియోగం చేస్తున్నారన్నారు. మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ చాలాకాలంగా విశాఖ డెయిరీలో ఆర్థిక అవకతవకలు జరుగుతున్నాయని, విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. దీనిపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు స్పందించి, సభ్యుల సూచన మేరకు సభాసంఘం వేస్తున్నామని చెప్పారు.

సన్విరా అడ్డదారి!

... 5వ పేజీ తరువాయి

ఇవ్వలేదని పంచాయతీ రాజ్ డీఈ మునిశేఖర్ తెలిపారు.

సీఎస్ఆర్ నిధులతో సొంత అవసరాలకు రోడ్డు నిర్మాణం

పూడిమడక నుంచి సన్విరా కర్మాగారం వరకు రోడ్డు విస్తరణ పనులను సీఎస్ఆర్ నిధులతో చేస్తున్నట్టు తెలిసింది. సీఎస్ఆర్ నిధులను గ్రామాల్లో సామాజిక కార్యక్రమాలకు వినియోగించాలి. కానీ సన్విరా కర్మాగారం యాజమాన్యం సీఎస్ఆర్ నిధులను తన సొంత అవసరాలకు వినియోగిస్తున్నట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు. రోడ్డు విస్తరణ పనులను సుమారు రూ.2 కోట్లతో చేపట్టినట్టు సమాచారం. పాత రోడ్డుకి ఇరువైపులా భారీ వృక్షాలను నరికివేశారు. ఉప్పు మడులను చదును చేశారు. ఇది ప్రభుత్వ భూమి అయినప్పటికీ అనుమతులు లేకుండా రోడ్డు నిర్మాణం చేపట్టడంపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.



పూడిమడక ఉన్నత పాఠశాల వద్ద రోడ్డు వెడల్పు పనులు

మూడేళ్ల సర్క్యులర్‌ను రద్దు చేయాలి

... 5వ పేజీ తరువాయి

మూడు సంవత్సరాల కాల పరిమితి సర్క్యులర్ తీసుకువచ్చిందని, దీనివల్ల 15 సంవత్సరాలకుపైగా పనిచేస్తున్న వీఓఏల కుటుంబాలు రోడ్డున పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. వీఓఏల ఆందోళనలతో గత ప్రభుత్వానికి ఈ సర్క్యులర్‌ను తాత్కాలికంగా నిలుపుదల చేసిందని చెప్పారు. ఇటీవల రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్.. ఈ సర్క్యులర్ ఆధారంగా మూడు సంవత్సరాలు పూర్తయిన వీఓఏలను మార్చుకోవచ్చునని ప్రకటన చేశారన్నారు. గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు సర్క్యులర్‌ను రద్దు చేసి వీఓఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వీఓఏల సంఘం జిల్లా అధ్యక్షుడు సూరిబాబు, కోశాధికారి లక్ష్మీప్రసన్న, సీఐటీయూ జిల్లా గౌరవాధ్యక్షుడు వీవీ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఫార్మా పరిశ్రమలు మూత!

... 5వ పేజీ తరువాయి

ట్యాంకర్ల ద్వారా నీటిని తెప్పించుకుంటున్నాయి.

నిర్వహణ లేకపోవడం వల్లే సమస్య

పంప్‌హౌస్‌లో వాడే మోటార్లు శక్తివంతమైనవి. వాటికి ఎప్పటికప్పుడు నిర్వహణ పనులు చేపట్టాలి. వైసీపీ ప్రభుత్వంలో ఏపీఐఐసీ అధికారులు నిర్వహణ గాలికి వదిలేశారు. దాంతో అవి ఒకదాని తరువాత మరొకటి మొండికేశాయి. పరిశ్రమలు రావాలని పిలుపునిస్తున్న ప్రభుత్వాలు అత్యంత ముఖ్యమైన నీటిని కూడా రోజుల తరబడి ఇవ్వలేని పరిస్థితి వస్తే ఎలాగని పారిశ్రామికవేత్తలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

క్రైం... crime news

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి



ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి

లంకెలపాలెం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): లంకెలపాలెం వద్ద రైలు ఢీకొనడంతో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. దువ్వాడ జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బుధవారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి రైలు పట్టాలు దాటుతుండగా విజయవాడ నుంచి విశాఖ వెళుతున్న రైలు ఢీకొంది. దీంతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. వయస్సు 35 ఏళ్లు వుంటాయని, నలుపు రంగు జీన్ ప్యాంటు, బ్లూ, పసుపు రంగుపై గీతల ఉన్న చొక్కా ధరించి ఉన్నాడని పోలీసులు తెలిపారు. చేతిపై 'అమ్మ- గీత' అని పచ్చబొట్టు రాసి ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. మృతుని ఆచూకీ లభిస్తే 73820 58996 నంబరును సంప్రతించాలని దువ్వాడ జీఆర్పీ ఎస్ఐ కేటీఆర్ లక్ష్మి పేర్కొన్నారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

అగనంపూడి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై అగనంపూడి పెట్రోల్ బంక్ వద్ద స్కూటీని లారీ ఢీకొనడంతో ఓ వ్యక్తి అక్కడిక్కడే మృతి చెందారు. దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చీడికాడ ఐటీఐ కాలనీకి చెందిన జాన నాగభూషణం (56) స్కూటీపై విశాఖ నగరానికి వస్తున్నారు. అగనంపూడి పెట్రోల్ బంక్ సమీపంలోకి వచ్చేసరికి వెనక నుంచి వేగంగా వచ్చిన లారీ ఢీకొన్నది. దీంతో నాగభూషణం ఘటనా స్థలిలోనే మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమ్మితం కేజీహెచ్‌కు తరలించారు.

భూమి అక్రమ రిజిస్ట్రేషన్‌పై కేసు నమోదు

» ఇద్దరి అరెస్టు

నక్కపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): భూమిపై అప్పు ఇచ్చిన వ్యక్తి, భూ హక్కుదారుడికి తెలియకుండా అక్రమంగా విక్రయించిన కేసులో పలువురిపై కేసు నమోదు చేశామని, వీరిలో ఇద్దరిని అరెస్టు చేశామని నక్కపల్లి సీఐ కుమారస్వామి, ఎస్ఐ సన్నిబాబు చెప్పారు. ఇందుకు సంబంధించి వీరు వెల్లడించిన వివరాలిలా వున్నాయి.

పాయకరావుపేట మండలం కుమారపురానికి చెందిన మద్ది నాగ రవికుమార్ తనకు చెందిన సుమారు ఎనిమిదిన్నర ఎకరాల వ్యవసాయ భూమి ఒరిజినల్ డాక్యుమెంట్లను తన స్నేహితుడైన తునికి చెందిన దేవవరపు వెంకుబాబుకు గతంలో ఇచ్చి రూ.5 లక్షలు అప్పు తీసుకున్నారు. కొంతకాలం తరువాత రవికుమార్ అప్పు తీర్చేనప్పటికీ ఒరిజినల్ డాక్యుమెంట్లు ఇవ్వడంలో వెంకుబాబు కాలయాపన చేశాడు. దీంతో అనుమానం వచ్చిన రవికుమార్ నక్కపల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సంప్రతించి ఈసీలు తీయించారు. తన భూమిని పలువురి పేరున అక్రమ రిజిస్ట్రేషన్ చేసినట్టు గుర్తించి నివ్వెరపోయాడు. దీంతో నక్కపల్లి పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వెంకుబాబు తన స్నేహితులైన కందికొండ శ్రీనివాసరావు, మహంతరపువెంకట కృష్ణలతో కలిసి రవికుమార్ సంతకాన్ని ఫోర్జరీ చేసి భూమిని అమ్మేసినట్టు గుర్తించారు. దీంతో మహంతరపు వెంకట కృష్ణ, కందికొండ శ్రీనివాసరావులను అరెస్టు చేశారు. ఈ కేసులో మరికొందరిని అరెస్టు చేయాల్సి వుందని ఎస్ఐ చెప్పారు.

19.47 కిలోల గంజాయితో నలుగురి అరెస్టు

ముంచంగిపుట్టు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తూరు జంక్షన్ వద్ద పోలీసులు 19.47 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని నలుగురిని అరెస్టు చేశారు. ఎస్ఐ జె.రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా నుంచి ముంచంగిపుట్టు మండలం మీదుగా గంజాయి రవాణా అవుతున్నట్టు పోలీసులకు మంగళవారం సాయంత్రం సమాచారం అందింది. దీంతో కొత్తూరు జంక్షన్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సమయంలో ఒక ఆటో, ఒక ద్విచక్ర వాహనాన్ని ఆపారు. వీటిల్లో ప్రయాణిస్తున్న వారిలో నలుగురిని అదుపులోకి తీసుకోగా, ఒకరు పారిపోయారు. ఆటోలో రెండు బస్తాల్లో ఉన్న 19.47 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ఒడిశా రాష్ట్ర మల్కన్‌గిరి జిల్లా పనసపుట్టు పంచాయతీ ముసిగూడ గ్రామానికి చెందిన పి.మజ్జి, కోరాపుట్టు జిల్లా నందపూర్ బ్లాక్ పాడువా పంచాయతీ చంపాపుట్టు గ్రామానికి చెందిన కిల్లో మధు, అల్లూరి జిల్లా అరకులోయ మండలం పెదలబుడు పంచాయతీ తాంగులగూడ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ తాంగుల పరశురామ్, డుంబ్రిగుడ మండలం గుంటసీమ పంచాయతీ దొరగూడ గ్రామానికి చెందిన గడ్డంగి సోమరాజులుగా గుర్తించారు. ఆటో, ద్విచక్ర వాహనంతోపాటు నాలుగు సెల్ ఫోన్లను సీజ్ చేశారు. నిందితులను అరెస్టు చేసి కోర్టుకు తరలించారు.